సాగుకు సన్నద్ధం!

ఎగువ ప్రాంతంలో నారుమడుల సందడి

దిగువ ప్రాంతంలో అదనుకు రాని భూములు

- మరిన్ని వర్షాలతోనే వాతావరణం అనుకూలమంటున్న రైతులు
- శివారు ప్రాంతాలకు ఈ నెల 23 తర్వాతే సాగునీటి విడుదల!



ఖరీఫ్ సాగుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. ఎగువ ప్రాంతంలోని గన్నవరం, పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో ఇప్పటికే నారుమడులు పోశారు. దిగువ ప్రాంతంలో మాత్రం భూములు అదనుకు రాలేదని వేచిచూస్తున్నారు. సమృద్ధిగా వర్షాలు కురిస్తేనే సాగుకు వాతావరణం అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. శివారు ప్రాంతాలకు ఈ నెల 23 తర్వాతే పూర్తి స్థాయిలో కాలువలకు నీటిని విడుదల చేయాలని యోచిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణాడెల్టాకు ఈ నెల 15వ తేదీన సాగు నీటిని విడుదల చేశారు. అయితే జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో నారు మడులు పోసేందుకు రైతులు పూర్తిస్థాయిలో ఆసక్తి చూపడం లేదు. శివారు ప్రాంతాల్లో చౌడు భూములు అధికంగా ఉన్నాయి. నారు మడులు పోసిన తర్వాత ఎండలు వేస్తే ఎదుగుదల లోపిస్తుందని ముందుకు రావడం లేదు. వాతావరణం చల్లబడిన తర్వాత సాగునీటిని విడుదల చేస్తే మేలని రైతులు సూచనప్రాయంగా చెబుతున్నారు. ప్రస్తుతం ప్రధాన కాలువలకు అవసరాల మేరకే ప్రకాశం బ్యారేజీ నుంచి సాగు నీటిని విడుదల చేస్తున్నారు. రైవస్ కాలువ, బందరు కాలువ, కేఈబీ కాలువ, రామరాజుపాలెం కాలువల ద్వారా శివారు ప్రాంతాలకు సాగునీరు అందాల్సి ఉంది. వాతావరణంలో మార్పులు ఏర్పడి వ్యవసాయానికి అనుకూలంగా మారిన తర్వాతే.. అనగా ఈ నెల 23వ తేదీ దాటాక ఈ కాలువలకు సాగు నీటిని పూర్తిస్థాయిలో విడుదల చేస్తామని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు.



బందరు కాలువలో గుర్రపు డెక్క, నిర్మూలనకు పిచికారీ చేసిన రసాయనాలు

పెరిగిన భూగర్భ జలాలు

పంట కాలువలకు ఎగువన ఉన్న కంకిపాడు, పెనమలూరు, గన్నవరం, పమిడిముక్కల, ఉయ్యూరు, మొవ్వ, తోట్లవల్లూరు తదితర మండలాల్లో బోరు నీటి ఆధారంగా రైతులు నారుమడులు పోశారు. కొందరు రైతులు వెదజల్లే పద్ధతిన సాగు చేశారు. మొక్క దశలో ఉన్న వరిపైరును కాపాడేందుకు బోరు నీటిని వాడుకుంటున్నారు. వేసవిలో ఊహించని విధంగా వర్షాలు కురవడంతో భూగర్భ జలాల నీటిమట్టం ఐదడుగుల మేర పెరిగిందని, గతంలో 40 అడుగుల లోతులో ఉన్న నీరు ప్రస్తుతం 35 అడుగులకు చేరిందని, దీంతో బోర్ల ద్వారా నీటిధార పూర్తిస్థాయిలో వస్తోందని కంకిపాడు, ఉయ్యూరు మండలాల రైతులు చెబుతున్నారు. కంకిపాడు మండలంలోని అధిక గ్రామాలకు సాగు నీటిని సరఫరా చేసే రైవస్ కాలువకు ఇంకా సాగు నీటిని విడుదల చేయకున్నా బోరు నీటి ఆధారంగా నారుమడులు

మిగతా 6లో..

పంట కాలువల్లో రసాయనాల పిచికారీ

పంట కాలువల్లో పెరిన గుర్రపు డెక్క, నాచు, తదితరాలను నిర్మూలించేందుకు రసాయనాలు పిచికారీ పనులు ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్నాయి. మరో మూడు, నాలుగు రోజుల పాటు ఈ పనులు చేసేందుకు సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. కాలువలకు సాగు నీటిని విడుదల చేసేందుకు అవకాశం ఉన్నా వీటి వల్ల విడుదల చేయడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. కంకిపాడు, పామర్రు, నిడుమోలు ప్రాంత రైతులు నారు మడులు పోసుకునేందుకు సరిపడినంతగా కాలువలకు నీటిని విడుదల చేస్తున్నామని అంటున్నారు. బందరు కాలువలకు అనుబంధంగా ఉన్న మల్లవోలు, గుండుపాలెం, రుద్రవరం తదితర ప్రాంతాలకు సాగునీటి సరఫరా చేసే కాలువ గట్లు బలహీనంగా ఉన్న చోట్ల మట్టి పనులు చేస్తున్నామని, వీటిని త్వరగా పూర్తి చేస్తామని నీటి పారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. కానీ ఈ ప్రాంతంలోని డ్రెయిన్లలో పెరిగిన గుర్రపు డెక్క, నాచు తదితరాల నిర్మూలనకు రసాయనాలు పిచికారీ ఇంకా చేపట్టలేదు.

దొంగ పట్టాలపై కదిలిన డొంక!

ఎన్నికల వేళ పేదలకు ఇళ్ల పట్టాలు పంచిన మాజీ మంత్రి పేర్ని నాని

- నాడు తహసీల్దార్ కార్యాలయంలో అర్ధరాత్రి సంతకాలు పెట్టిస్తుంటే అడ్డుకున్న కూటమి నేతలు
- అప్పటి నుంచి ఇరు పార్టీల మధ్య వివాదంగా దొంగ పట్టాల వ్యవహారం
- మంగళవారం రాత్రి మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయంలలో అధికారుల తనిఖీలు
- నేడు తనిఖీలు కొనసాగించాలని ఆర్డీవో ఆదేశాలు



మచిలీపట్నం నియోజకవర్గంలో ఎన్నికల ముందు మాజీ మంత్రి పేర్ని నాని పంపిణీ చేసిన దొంగ ఇళ్ల పట్టాల వ్యవహారంపై డొంక కదిలింది. కర్రగ్రహారం, చిలకలపూడిలో 320 ఎకరాలకు పైగా భూమిలో అనర్హులకు పట్టాలు ఇచ్చిన విషయంపై, ఫ్రీట్‌ఫీల్డ్ పేరుతో 870 మందికిపైగా పేదలకు పట్టాలు ఇచ్చిన అంశంపై మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, రెవెన్యూ అధికారులు మంగళవారం రాత్రి విచారణ చేపట్టారు. మచిలీపట్నం తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న రికార్డులను పరిశీలించారు. అసలు ఎంతమందికి పట్టాలు ఇచ్చారు.. వారిలో అర్హులు ఎంతమంది, అనర్హులు ఎంత మంది అనే అంశంపై రికార్డులను తనిఖీ చేస్తున్నారు. కొన్ని కీలకమైన ఆధారాలు లభ్యం కాగా, మరిన్ని వివరాల కోసం బుధవారం కూడా రెవెన్యూ రికార్డులను, ఇంటి పట్టాలకు సంబంధించిన పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని నిర్ణయించారు.

మిగతా 6లో..

బండికి సవాళ్లు!

జిల్లాలో నిరుపయోగంగా జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ భవనాలు, స్థలాలు

- రూ.కోట్ల విలువైన ఆస్తులున్నా ఆదాయం అంతంతమాత్రమే!
- నేడు డీసీఎంఎస్ చైర్మన్‌గా బండి రామకృష్ణ బాధ్యతల స్వీకరణ

(ఆంధ్రజ్యోతి - మచిలీపట్నం టౌన్): కృష్ణాజిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించనున్న జనసేన నాయకుడు బండి రామకృష్ణకు పలు సమస్యలు సవాళ్లు విసరనున్నాయి. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి మచిలీపట్నం చమ్మనగిరిపేటలో విలువైన స్థలం ఉంది. ఆ స్థలంలో ఒకప్పుడు మార్కెటింగ్ కార్యకలాపాలు నడిచేవి. ఈ స్థలంలో ఉండే భవనం శిథిలమైంది. ఆ భవనాన్ని ఇటీవల తొలగించారు. కొంత కాలం సొసైటీ అధ్యక్షుడు అక్కడ ఉండి పర్యవేక్షించేవారు. స్థలంలోని మట్టిని తవ్వుకుపోతున్నారు. ఎవరు పడితే వారు తమ వస్తువులను అక్కడ ఉంచుతున్నారు. పట్టించుకునే నాథుడే లేడు. 'ఇంట గెలిచి రచ్చగెలవాలన్న' చందంగా మచిలీపట్నంలోని కృష్ణాజిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి చెందిన ఆస్తులను పరిరక్షించే బాధ్యత బండి రామకృష్ణపై ఉంది. అలాగే నూజివీడులో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి స్థలం ఉంది. కోట్లాది రూపాయల విలువైన ఈ స్థలం నిరుపయోగంగా పడి ఉంది. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ పరిధిలో ఉండే మార్కెట్ యార్డులు గత ప్రభుత్వం

మిగతా 6లో..



చమ్మనగిరిపేటలోని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ స్థలం దుస్థితి

అధ్యయనం చేస్తున్నాం : బండి రామకృష్ణ



కృష్ణాజిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ కార్యకలాపాలపై ఇప్పుడే అధ్యయనం చేస్తున్నా. సొసైటీని గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తా. రైతుల కష్టసుఖాలు నాకు తెలుసు. కేవలం వ్యాపార పరంగానే కాకుండా రైతుల సంక్షేమంపై దృష్టి సారిస్తా. సొసైటీకి తగినన్ని ఆదాయ వనరులు లేకుండా పోయాయి. రైతు సేవా కేంద్రాల నుంచి వచ్చే కమీషన్‌తో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు స్టేషనరీ అమ్మి వచ్చే కొద్దిపాటి లాభాలతో సొసైటీని నిర్వహించ వలసి ఉంది. విజయవాడలో కార్యాలయం ఉంది. అయినప్పటికీ మచిలీపట్నంలో విలువైన ఖాళీస్థలంలో ఏవైనా నిర్మాణాలు చేపడదామనుకుంటున్నాం. కూటమి ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా సొసైటీని తీర్చిదిద్దుతా.

బినామీలతో పరేషన్!

ఉమ్మడి కృష్ణాలో 150 మంది బినామీ రేషన్ డీలర్లు!

విధానాలు మారినా ప్రజా పంపిణీ వ్యవస్థ తీరు మారడం లేదు. అవినీతిమయమైన ఎండీయూ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసి డీలర్ల చేతికే రేషన్ పంపిణీ బాధ్యతలు అప్పగించినా పంపిణీ శాతం మాత్రం పెరగలేదు. దీనికి కారణం బినామీ డీలర్లేనని తెలుస్తోంది. పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీరిని నియంత్రించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

- పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తోన్న అక్రమార్కులు
- కార్డుదారులకు పెరగని పంపిణీ శాతం
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం.. మామూళ్ల మత్తులో అధికారులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ప్రజా పంపిణీ వ్యవస్థలో బినామీ డీలర్లు రాజ్యమేలుతున్నారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో కలిపి మొత్తం 150 మందికిపైగా వీరు ఉన్నట్టు తెలుస్తోంది. ఎండీయూ వ్యవస్థలో డోర్ డెలివరీ పేరుతో కార్డుదారులకు బియ్యాన్ని ఇచ్చినట్టు ఇచ్చి, వారి దగ్గర ఎదురు కొనుగోలు చేసి అదే వాహనాల్లో తరలించుకుపోయేవారు. ఈ విధానాన్ని అరికట్టేందుకు, పంపిణీ శాతాన్ని గణనీయంగా పెంచేందుకు కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దు చేసింది. రేషన్ దుకాణాల నుంచే నిత్యావసరాల పంపిణీ చేపట్టింది. తొలి నెల పంపిణీ శాతం దాదాపుగా సమానంగా ఉండటంతో.. సివిల్ సప్లయిస్ ఉన్నతాధికారులు సైతం విస్తుపోతున్నారు. దీనిపై లోతుగా వెళితే.. బినామీ డీలర్ల అక్రమాల వల్లనే పంపిణీ శాతం మెరుగు పడలేదని తెలుస్తోంది. కార్డుదారులు పూర్తి స్థాయిలో బియ్యం తీసుకోకపోవటానికి ప్రధానంగా బినామీ డీలర్లు రేషన్‌ను దారి మళ్లించడమే కారణమని సమాచారం. గతంలో డీలర్లు స్టాకిస్టులుగా ఉన్నప్పుడు కూడా ఎండీయూ ఆపరేటర్లతో బినామీ డీలర్లు మిలాఖత్ అయ్యి పేదల బియ్యాన్ని తరలించేవారు. ఇప్పుడు డీలర్లే పంపిణీ దారులుగా మారారు. కార్డుదారులకు నిత్యావసరాల పంపిణీ శాతం గణనీయంగా పెరగాలని గట్టిగా ప్రభుత్వం నిర్దేశించినా కూడా బినామీ డీలర్లు పాతపనే చేస్తున్నారు. దీంతో బియ్యం పంపిణీ

మిగతా 6లో..

బినామీలను కనిపెట్టే అవకాశం ఉన్నా..

డీలర్లు ఎన్ని సార్లు లాగిన్ అయ్యారు. ఎంత సమయం లాగిన్‌లో ఉన్నారు అనేది తెలుసుకునే వ్యవస్థ సివిల్ సప్లయిస్ దగ్గర ఉంది. దీనిని బట్టి డీలర్లు లాగిన్ చేస్తున్నారో, ఇతరులు లాగిన్ చేస్తున్నారో అర్థమవుతుంది. ఎవరు లాగిన్ చేస్తున్నారో కూడా తెలుస్తుంది. కాబట్టి బినామీ డీలర్లను కనిపెట్టడం కూడా సులువే. కానీ అధికారులు ఆ వైపు దృష్టి సారించడంలేదని విమర్శలు వస్తున్నాయి.

పెట్టుబడి అంతా అక్రమ వ్యాపారులదే..

కొంత మంది డీలర్లలో నిత్యావసరాలకు డీడీలు కట్టలేని వారు కూడా ఉన్నారు. ఇలాంటి డీలర్లు ఏనాడో అక్రమ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోయారు. వారు ఇచ్చే జీతాలకు అలవాటు పడిపోయారు. దీంతో అక్రమార్కులు తమ కనుసైగలతో డిపో నడిపిస్తున్నారు. పేదలకందాల్సిన బియ్యం పక్కదారి పట్టిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో వీటిని అడ్డుకోవాల్సిన పీడీఎస్ డీటీలు మామూళ్ల మత్తులో పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకుల మృతి

8

సమస్యలతో సహజీవనం

కృష్ణాజిల్లా వణుకూరు జగనన్న కాలనీలో దుస్థితి

- విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 5,440 మందికి ఇళ్ల స్థలాల కేటాయింపు
- పూర్తయిన 1400 గృహాలు.. నిర్మాణ దశలో మరో 1300 ఇళ్లు
- పట్టాలు ఇచ్చి కనీస వసతులు మరచిన గత వైసీపీ ప్రభుత్వం
- తాగు నీరు, రోడ్లు, డ్రెయిన్లు, కరెంటు సమస్యలతో స్థానికులు సతమతం
- పట్టించుకోని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అధికారులు



గుంతలమయంగా ప్రధాన రోడ్డు

కృష్ణాజిల్లా వణుకూరు జగనన్న కాలనీలో కనీస వసతులు కరువై సమస్యలతో స్థానికులు సహజీవనం చేస్తున్నారు. తాగేందుకు గుక్కెడు నీరు దొరక్క అలమటించిపోతున్నారు. బురదతో నిండిన రోడ్లపై రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు. వాడుకున్న నీరు బయటకు పోయే దారి లేక అక్కడే రోజుల తరబడి నిలిచి పోయి దుర్వాసన వెదజల్లుతోంది. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రుళ్లు బయటకు రావడానికి జంకుతున్నారు. రెక్కాడితే గాని డొక్క నిండని పేదల కష్టాలను ఇటు ఎన్టీఆర్ జిల్లా అధికారులు, అటు కృష్ణాజిల్లా అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.



వణుకూరు జగనన్న కాలనీ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ): విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 5,440 మంది పేదలకు కృష్ణాజిల్లా వణుకూరు జగనన్న కాలనీ (వీఎంసీ లేఅవుట్)లో ఒక్కొక్కరికి సెంటు చొప్పున గత వైసీపీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించింది. ఇప్పటి వరకు 1,400 గృహాలు పూర్తవగా, మరో 1,300 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. పూర్తయిన ఇళ్లలో 100పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇక్కడ మౌలిక వసతులను గత వైసీపీ ప్రభుత్వం కల్పించకుండా వదిలేసింది. దీంతో తాగు నీరు, రోడ్లు, డ్రెయిన్ల సమస్యలతో

మిగతా 6లో..



ముఖ్యమంత్రిని కలిసిన పెన్మెత్స

సుపరిపాలన ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబును సెక్రటేరియట్‌లో ఎస్.ఎల్.వి. గ్రూప్ ఛైర్మన్ పెన్మెత్స శ్రీనివాసరాజు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అంతర్జాతీయ వేదికపై

సిద్ధార్థ అకాడమి విద్యార్థి ప్రతిభ

పెనమలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌కు చెందిన విద్యార్థి ముదుంబి రంగాచార్యులు అంతర్జాతీయస్థాయిలో తన ప్రతిభను చాటుకున్నారు. ద్విచక్రవాహనదారుల నిద్ర మూడతను ముందుగానే గుర్తించి ప్రమాదాలు నివారించేందుకు న్యూరోరైడ్ అనే పరికరాన్ని అభివృద్ధి చేసి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందాడు. వీఆర్ సిద్ధార్థలో రెండో ఏడాది బీటెక్(ఏఐ) చదువుతున్న రంగాచార్యులు గత మే నెలలో అమెరికాలోని టెక్సాస్ స్టేట్ యూనివర్సిటీలో నిర్వహించిన గ్లోబల్ జూనికార్న్ అండ్ ఏఐ స్టేట్ సమ్మిట్ 2025లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించారు. విద్యార్థి రంగాచార్యులును ప్రెసిడెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, సెక్రటరీ పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ మలినేని రాజయ్య, వీసీ ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రోవీసీ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ తదితరులు అభినందించారు.

సీఎం చంద్రబాబుకు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

పెనమలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబుకు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లని టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు పేర్కొన్నారు. మంగళవారం అశోక్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో తల్లికి వందనం లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒక పక్క అమరావతి, పోలవరం నిర్మాణం లాంటి అభివృద్ధి, కార్యక్రమాలను శరవేగంగా చేస్తూ... మరోపక్క ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే వారందరికీ తల్లికి వందనం లాంటి సంక్షేమ పథకాన్ని అమలు చేయడం చంద్రబాబుకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బుజ్జి, టీడీపీ రెహమాన్, కొండా ప్రవీణ్, రియాజ్, ఇమాం తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న తల్లికి వందనం లబ్ధిదారులు

ఎన్ఎంఎంఎస్ సాధించిన అలేఖ్యకు అభినందన

ఉయ్యూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ సాధించిన కడవకొల్లుకు చెందిన కట్టా అలేఖ్యను ఉయ్యూరు డివిజన్ ఉపవిద్యాశాఖ అధికారి జి. పద్మారాణి అభినందించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అలేఖ్య ఇటీవల నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ కనపరచి స్కాలర్‌షిప్ పొందేదుకు ఎంపికైంది. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అలేఖ్యను ఘనంగా సత్కరించారు. స్కూల్ హెచ్ఎం పూర్ణ బెనర్జీ, ఎం.శ్రీధర్, ఉపాధ్యాయులు బాబూజీ పాల్గొని అలేఖ్యను అభినందించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హెచ్ఎం నాగలక్ష్మి నోట్‌బుక్స్ అందజేశారు.


తల్లికి వందనంపై విషప్రచారం దారుణం

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనంపై విషప్రచారం దారుణమని, ఎన్నికల హామీలను ప్రాధాన్యత క్రమంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని, స్కూళ్లు తెరిచే నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు స్కూలు బ్యాగులు అందజేయడంతో పాటు తల్లికి వందనం పథకం అమలు చేసి తల్లుల ఖాతాలో నిధులు జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు.

డ్రెయిన్ల మరమ్మతులు ముమ్మరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : గత సంవత్సరం భారీ వర్షాలకు పంట నష్టానికి కారణమైన డ్రెయిన్లు, చానళ్లలో పెరిగిన చెట్లను తొలగించి, పూడికతీత పనుల ద్వారా ముంపు నివారణ చర్యలు చేపట్టినట్లు డీసీ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ వివరించారు. ఆరుగొలను వద్ద వీరవల్లి-1 చానల్ చివరి భాగంలో భారీగా మొలిచిన తుమ్మచెట్లు, పూడికతీత పనులను మంగళవారం టీడీపీ అధ్యక్షుడు బేతా శేషుకుమార్‌తో కలిసి ప్రారంభించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 9 కిమీ గల వీరవల్లి చానల్ చివరి ప్రాంతాల్లో భారీగా చెట్లు మొలిచి కాలువ పూడుకుపోయిందని రైతులు తెలిపారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో ఎట్టకేలకు కాలువ మరమ్మతులు చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.



బ్రోచర్లను విడుదల చేస్తున్న సంస్థ సీఎండీ రామచంద్రరావు, సభ్యులు

ఆకునూరులో శ్రీ భ్రమర హోమ్స్ సిగ్నేచర్ ప్రాజెక్ట్‌కు శ్రీకారం

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వినూత్న ఆలోచనలతో దూసుకుపోతున్న శ్రీ భ్రమర హోమ్స్ విజయవాడ నగరంలోని ఆకునూరు వద్ద సిగ్నేచర్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్టు సంస్థ ఛైర్మన్, ఎండీ గల్లా రామచంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా బెంజ్ సర్కిల్ జ్యోతి కన్వెన్షన్ సెంటర్‌లో శ్రీ భ్రమర హోమ్స్ గ్రాండ్ ప్రీ లాంచ్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. సీఎండీ గల్లా రామచంద్రరావు, డైరెక్టర్ మారం చంద్రశేఖర్‌లు నూతన ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ, 'శ్రీ భ్రమర హోమ్స్'లో విల్లాస్, విల్లా ప్లాట్స్ ప్లాన్ చేసినట్టు తెలిపారు. అత్యాధునిక సౌకర్యాలతో పాటు నిర్మాణ రంగంలో కొత్తదనం సృష్టించాలనే ఆశయంతో, 2015 నుంచి 35కి పైగా ప్రాజెక్టులతో, 10 వేల మందికి పైగా కుటుంబాల సొంతింటికల నెరవేర్చినట్టు తెలిపారు. కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో వేలాది కుటుంబాలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు అందించి, స్థిరాస్తి రంగంలో తమదైన ముద్ర వేసుకున్నట్టు పేర్కొన్నారు.





దయనీయ స్థితిలో కాజ్‌వేలు, బ్రిడ్జిలు

వారధులకు కష్టకాలం!

ఆంధ్రజ్యోతి పరిశీలన

- తెలుగు రాష్ట్రాల ప్రజల రాకపోకలకు ప్రధాన మార్గాలు
- వంతెనలకు అప్రోచ్‌లు లేక వాహనదారుల ఇక్కట్లు
- ట్రాఫిక్ కష్టాలు.. వరదలొస్తే రాకపోకలు బంద్..
- శాశ్వత మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి సారించాలి

అప్రోచ్ లేనందున నిరుపయోగంగా ఉన్న కూడలి వంతెన

మునేటి వరదలో మునిగిన లింగాల కాజ్‌వే (ఫైల్‌ఫొటో)

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల/వత్సవాయి/జగ్గయ్యపేట): అన్నీ కృష్ణా ఉపనదులైన వైరా, మున్నేరు, పాలేటిలపై కాజ్‌వేలు, బ్రిడ్జిలు. తెలుగురాష్ట్రాల ప్రజల రాకపోకలకు ఇవే వారధులు. దశాబ్దాల క్రితం వీటిని నిర్మించారు. నేడు శిథిల స్థితికి చేరుకుంటున్నాయి. వరదలొస్తే ప్రజల కష్టాలు చెప్పలేకుండా ఉంటున్నాయి. దెబ్బతిన్న కాజ్‌వేల పరిస్థితి దయనీయంగా ఉంది. నామమాత్రంగా చేసిన మరమ్మతులు పనిచేయటం లేదు. శాశ్వత ప్రాతిపదికన పనులు చేయకపోవటంతో రాకపోకలకు కష్టంగా మారుతోంది. కాజ్‌వేలకు అప్రోచ్‌లు లేకపోవటం ఒక సమస్య అయితే.. లో లెవల్‌లో ఉండటం మరో సమస్య. హై లెవల్ బ్రిడ్జిలు కావాలన్న ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. కానీ ఏవీ కార్యరూపం దాల్చటం లేదు. పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలో తెలుగు రాష్ట్రాలకు రాకపోకలకు దోహదపడే వీటి పునరుద్ధరణకు ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరం ఉంది. కృష్ణా ఉపనదులపై ఉన్న కాజ్‌వేలు, బ్రిడ్జిల దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి ఫోకస్'..

నిరుపయోగంగా వంతెన..

చెవిటికల్లు-వత్సవాయి ఆర్అండ్‌బీ రోడ్డులో నందిగామ మండలం కూడలి, వీరులపాడు మండలం పల్లెంపల్లి గ్రామాల మధ్య వైరా నదిపై నిర్మించిన వంతెన ఎనిమిదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. రూ. కోట్ల వ్యయంతో వంతెన నిర్మించినప్పటికీ, కేవలం అప్రోచ్ రోడ్డు వేయనందున ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దాములూరు కూడలి వద్ద వైరా ఏటిలో దశాబ్దాల క్రితం నిర్మించిన లోలెవల్ కాజ్‌వే దెబ్బతింది. వంతెనకు ఎగువ భాగంలో దీనిని నిర్మించడంతో వరద వచ్చినపుడల్లా కాజ్‌వే పూర్తిగా మునిగిపోతోంది. వర్షాకాలంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయి తెలుగు రాష్ట్రాలకు చెందిన 50 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర విభజన తర్వాత తెలుగుదేశం ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ.6.50 కోట్లు మంజూరు చేసింది. 200 మీటర్ల పొడవున వంతెన నిర్మించారు. అప్పట్లో అప్రోచ్‌కు అవసరమైన భూమి సేకరణ విషయంలో రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. అప్పటి నుంచి వంతెన నిరుపయోగంగా ఉంది. కాజ్‌వేనే దిక్కవటంతో వర్షాకాలంలో ప్రజలకు కష్టాలు తప్పటం లేదు. రైతుల అంగీకారంతో భూసేకరణ అంశం కొలిక్కి వచ్చిందని నందిగామ ఆర్డీవో బాలకృష్ణ చెప్పారు. రివైజ్డ్ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని, అనుమతి రావల్సి ఉందని ఆర్అండ్‌బీ ఏఈ తెలిపారు.

శిథిలావస్థలో లింగాల కాజ్‌వే..

తెలుగు రాష్ట్రాలను కలిపే చిల్లకల్లు-వైరా రహదారి ముఖ్యమైనది. ఈ మార్గంలో నిత్యం వేలసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అత్యంత రద్దీ ఉండే రహదారిలో వత్సవాయి మండలం లింగాల వద్ద మునేటిపై 1964లో వరద నీరు దిగువకు వెళ్లేలా 56 ఖానాలతో 850 మీటర్ల లోలెవల్ కాజ్‌వే నిర్మించారు. ఒకవైపు భారీ వాహనాల రద్దీ.. మరోవైపు మునేటి వరదలకు ఈ కాజ్‌వే శిథిలావస్థకు చేరింది. భారీగా వరదలు వస్తే ఈ కాజ్‌వేను మూసేస్తున్నారు. వాహనాలను పెనుగంచిప్రోలు-మక్కపేట దారిలో మళ్లిస్తున్నారు. సింగిల్ రూటు కావటం, అదనంగా పది కిలోమీటర్లు చుట్టూ తిరగాల్సి రావటంతో వాహనదారులు, ప్రజలు అధిక వ్యయప్రయాసలకు గురౌతున్నారు. ఈ నేపథ్యంలో, గతేడాది రికార్డు స్థాయిలో వచ్చిన వరదకు కాజ్‌వే నామరూపాలు లేకుండా ధ్వంసమైంది. రోజుల తరబడి ఈ మార్గం బంద్ అయింది. ప్రస్తుతం రూ.రెండు కోట్లతో కాజ్‌వేకు మరమ్మతులు చేస్తున్నారు.



చిల్లకల్లు - వైరా రూటులో లింగాల కాజ్‌వే

హైలెవల్ వంతెన ఏర్పాటు ఎప్పుడు?

జగ్గయ్యపేట-ముక్త్యాల మార్గంలో అగ్రహారం వద్ద పాలేటిపై ఉన్న లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెన నిర్మించాలన్న ప్రతిపాదన ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది. దశాబ్దాల క్రితం నిర్మించిన అగ్రహారం వంతెన ప్రస్తుతం వాహనాల రద్దీని తట్టుకోలేకపోతోంది. జగ్గయ్యపేట ప్రాంతంలోని పలు సిమెంట్ ఫ్యాక్టరీలు, విశాఖ స్టీల్ ప్లాంట్, పులిచింతల ప్రాజెక్టు, ఇతరత్రా పలు సంస్థలకు ఈ మార్గం ప్రధానమైనది. సూర్యాపేట జిల్లా దొండపాడు, మేళ్లచెరువు మీదుగా తెలంగాణా రాష్ట్రంలోకి వెళ్లేందుకు ఈ వంతెన కీలకం. లోలెవల్ వంతెన కావటంతో వరద వచ్చినపుడు రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. చుట్టూ తిరగాల్సి రావటంతో సమయం, సొమ్ము వృధా అవుతోంది. నిత్యం అధిక లోడ్‌తో భారీ వాహనాలు తిరుగుతుంటాయి. లోలెవల్ ఉండటం, అధిక భారం పడటంతో వంతెన సామర్థ్యం చాలటం లేదు. దీనికితోడు గత ఏడాది సెప్టెంబరులో పాలేటికి భారీ వరద రావటంతో వంతెన ఆనుకుని రోడ్డు ఎనిమిది అడుగులకు పైగా కోసుకుపోయింది. తాత్కాలికంగా గండిని పూడ్చారు. అయితే పెరిగిన వాహనాల రద్దీని తట్టుకునేందుకు

అగ్రహారం వంతెన



రెండులైన్ల హైలెవల్ వంతెన నిర్మించాలన్న ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. వంతెనకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురామ్ ఇటీవల సీఎం చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేశారు.

దొంగ పట్టాలపై కదిలిన డొంక!

మచిలీపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో సర్వే చేయించి ఇళ్ల స్థలాలు లేని వారిని గుర్తించారు. మచిలీపట్నం నగరంలో 16 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించి 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఉత్తర్వులు జారీ చేశారు. నవశకం పథకంలో భాగంగా అప్పటి మునిసిపల్ కమిషనర్ కాంపిటేటివ్ అథారిటీని ఏర్పాటు చేశారు. ఆర్డీవో స్థాయిలో మచిలీపట్నం నియోజకవర్గంలో 19,200 మందికిపైగా ఇళ్లపట్టాలు ఇవ్వాలని నిర్ణయించారు. భూసేకరణ ప్రత్యేక అధికారిగా ఉన్న కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ మచిలీపట్నం రాగా, ముడా భూములను ఆయనకు అధికారులు చూపారు. ఈ భూములు నివాసానికి పనికిరావని తేల్చారు. దీంతో ప్రైవేటు భూములను సేకరించాలని నిర్ణయించారు. కరగ్రహారం, చిలకలపూడిలోని ప్రైవేటు భూములను పరిశీలించారు. కరగ్రహారంలో ఎకరం రూ.11.50 లక్షల ధర ఉండగా.. చిలకలపూడిలో రూ. 70 లక్షల వరకు ఎకరం భూమి ధర ఉంది. మధ్యేమార్గంగా ఈ రెండు ప్రాంతాల్లోని భూమి ధరను కలెక్టర్ రూ.39 లక్షలుగా నిర్ణయించారు. 320 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఇందులో 60 ఎకరాలకుపైగా భూమికి సరైన పత్రాలు లేకపోవడంతో దీనికి సంబంధించిన నగదును కోర్టులో కట్టారు. సేకరించిన భూమిని ఏ నుంచి ఎల్ బ్లాక్‌లుగా విభజించి చదును చేశారు. ఇందులో అనర్హులకు సెంటు భూమి చొప్పున పట్టాలు ఇచ్చారనే అంశంపై పలు ఫిర్యాదులు అందాయి. దీంతో పాటు మచిలీపట్నం నగరంలో రహదారులు వెంబడి నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్న వారికి ఇంటి పట్టాలు ఇవ్వడానికి పట్టాలు ముద్రించారని, ఇందుకు అప్పట్లో పనిచేసిన జేసీ మాధవీలత ప్రత్యేక లాగిన్ తీసుకుని పట్టాలు ఇచ్చేందుకు అనుమతులు ఇచ్చారని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక నకిలీ పట్టాలపై తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సంతకాలు పెట్టిస్తున్నారని గ్రహించిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొల్లు రవీంద్ర, టీడీపీ, జనసేన నాయకులు రాత్రి 12 గంటల సమయంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో జేసీ గీతాంజలిశర్మ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పట్టాలను స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి దొంగపట్టాల వ్యవహారంపై వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య రాజకీయపరంగా వివాదం నడుస్తోంది. తాజాగా దొంగపట్టాల విషయంలో మాజీ మంత్రి పేర్ని నాని అరెస్ట్ అవుతారనే అంశంపై ఇటీవల కాలంలో ప్రచారం విస్తృతంగా సాగుతోంది. మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి పేర్ని నాని విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి సవాళ్లు ప్రతిసవాళ్లు విసురుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు మంగళవారం రాత్రి ఇంటి పట్టాల పంపిణీ అంశంపై విచారణ ప్రారంభించడంతో ఈ వివాదం ఎన్ని మలుపులు తిరుగుతుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది,

బండికి సవాళ్లు!

(5వ పేజీ తరువాయి)

నిర్లయంతో దీని పరిధి నుంచి వెళ్లిపోయాయి. జిల్లాలోని 109 రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులు పండించిన ధాన్యం, అపరాలు ప్రస్తుతం మార్కెటింగ్ చేస్తున్నారు. సివిల్ సప్లయిస్ శాఖకు అనుబంధంగా ఉంటూ జిల్లాలోని రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే రైతు సేవా కేంద్రాలను రైతులకు మెరుగైన సేవలు అందించేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉంది. వ్యాపారవేత్తగా అనుభవం ఉన్న బండి రామకృష్ణ ఈ దిశగా కృష్ణాజిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి జవసత్వాలు తీసుకువస్తారని ఆశిద్దాం.

అంచెలంచెలుగా ఎదిగిన రామకృష్ణ



రామకృష్ణను అభినందిస్తున్న జనసేన నేత గడ్డం రాజు

మచిలీపట్నం టౌన్ : హోటల్ కార్మికునిగా జీవనం ప్రారంభించి ఆర్కే హోటల్స్‌కే యజమాని అయిన బండి రామకృష్ణ మచిలీపట్నం నియోజకవర్గంలో పలు విద్యాసంస్థలతో పాటు హోటళ్లను స్థాపించి ప్రజలకు సుపరిచితుడయ్యారు. పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో 2019లో మచిలీపట్నం నుంచి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి రాజకీయ అరంగేట్రం చేశారు. అనంతరం కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా 2024 ఎన్నికల్లో కొల్లు రవీంద్ర, బాలశౌరి విజయానికి కృషి చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం బండి రామకృష్ణకు డీసీఎంఎస్ అధ్యక్ష పదవిని ఇవ్వడంతో బుధవారం ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సత్య కన్వెన్షన్ హాలులో జరిగే ప్రమాణ స్వీకార మహోత్సవానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మార్కెట్ యార్డు ఛైర్మన్లు పాల్గొంటారని జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు తెలిపారు.

బినామీలతో పరేషన్!

(5వ పేజీ తరువాయి)

శాతం పెరగటం లేదు.

బినామీ డీలర్లదే హవా!

సివిల్ సప్లయిస్‌లోకి బినామీ డీలర్లు ఎలా ప్రవేశిస్తున్నారో తెలిస్తే ఆశ్చర్యపోతారు. అసలైన డీలర్ల పేర్లు కాగితాల మీదనే కనిపిస్తాయి. పరీక్షలు రాసి, తమ తెలివితేటలతో దక్కించుకున్న వారు ఇప్పటికీ చాలా వరకు షాపులను నిర్వహిస్తున్నారు. ధన ఆశ, అక్రమ వ్యాపారం చేయాలన్న ఉద్దేశ్యం, రాజకీయ సిఫార్సులతో వచ్చిన వారి డిపోలు సింహభాగం బినామీల చేతిలోకి వెళ్లాయి. ఇంకాస్త వివరంగా చెప్పాలంటే అక్రమ బియ్యం వ్యాపారుల స్వాధీనంలో ఉన్నాయి. ఇంత తెలిగ్గా బినామీల చేతుల్లో రేషన్ దుకాణాలు ఎలా నడుస్తున్నాయో చూస్తే ఆశ్చర్యపోతారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి నిత్యావసరాలను డీలర్లు దిగుమతి చేసుకోవాలి. కానీ నామినీల పేరుతో భార్య, ఇతరుల పేర్లను డీలర్లు ఇస్తున్నారు. డీలర్లు సూచించిన నామినీలు ఎవరైనా సరే ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం దిగుమతి చేసుకోవటానికి అవకాశం ఉంటోంది. దీంతో బినామీ డీలర్ల పని సులువైపోతోంది. బినామీ డీలర్లు ఒరిజినల్ డీలర్లుగా వ్యవహరిస్తూ నిత్యావసరాలను డ్రా చేసుకుని తరలించుకుపోతున్నారు. కార్డుదారులకు వీలైనంత వరకు ఇచ్చి .. మిగిలిన వాటిని గుట్టుగా తరలించేస్తున్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు

కృష్ణప్రసాద్(చిన్ని)కి తుది వీడ్కోలు





ఉంగుటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, కొయ్యగూరపాడు పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ కొరివి కృష్ణప్రసాద్ అలియాస్ చిన్ని(62) అకాల మరణం గ్రామాభివృద్ధికి, పార్టీకి తీరని లోటని పలువురు ప్రముఖులు అన్నారు. కొయ్యగూరపాడు సర్పంచ్ కొరివి మాధవి భర్త కృష్ణప్రసాద్ గుండెపోటుతో పోరంకిలోని తన సొంత అపార్ట్‌మెంట్‌లో శనివారం కన్నుమూశారు. కుమారుడు శేషు (ఎన్నారై) అమెరికా నుంచి వచ్చిన తర్వాత మంగళవారం ఉదయం స్వగ్రామమైన కొయ్యగూరపాడుకు చిన్ని మృతదేహాన్ని తీసుకువచ్చారు. ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, గద్దె రామ్మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు తదితరులు కృష్ణప్రసాద్ పార్థివదేహంపై పార్టీజెండాను కప్పి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, కొరివి పార్థసారథి, నాయకులు గోపీచంద్, తోట నాగభూషణం, బత్తుల పుల్లారెడ్డి, వెంకటరెడ్డి, వడ్లమూడి సుబ్బారావు, చల్లగుళ్ల సత్యనారాయణ, నెక్కంటి వెంకటేశ్వరరావు, పోలుకొండ యేసు, వీరపనేని మురళీధర్, జయప్రసాద్, పోతినేని రామకృష్ణ, దాసరి వెంకటబాపినీడు, శ్రీను, తోట గోపి, నర్సిశెట్టి నాగరాజు పాల్గొన్నారు.

అశ్రునయనాలతో కృష్ణప్రసాద్‌కు తుది వీడ్కోలు

గ్రామాభివృద్ధిలో తలలో నాలుకలా వ్యవహరించే కృష్ణప్రసాద్‌ను కడసారిగా చూసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆయన అంతిమయాత్రలో పాల్గొని అశ్రునయనాలతో తుది వీడ్కోలు పలికారు. స్థానిక శ్మశానవాటికలో కుమారుడు శేషు చేతులమీదుగా దహన సంస్కారాలు నిర్వహించారు.

సాగుకు సన్నద్ధం!

(5వ పేజీ తరువాయి)

పోయడంతో పాటు, వెదజల్లే పద్ధతిలో సాగు చేపట్టారు. ఈ ఏడాది ఎంటీయూ 1061, 1318, 1224, 1262, బీపీటీ-5204, స్వర్ణ తదితర రకాల వరి వంగడాలతో పాటు ఎంటీయూ 2077, 5293, పీఎల్‌ఏ 1100 (బాలామసూరి)వంటి పాతరకాల వరి వంగడాలను రైతులు సాగుచేసే యోచనలో ఉన్నారు. ఇప్పటికే 550 ఎకరాలకుపైగా నారుమడులు పోశారు. ఈ ఏడాది మేలో భారీ వర్షాలు కురవడంతో పూర్తిస్థాయిలో నేల ఆరలేదని, దీంతో వరి పైరుకు తెగుళ్లబెడద అధికంగా ఉండే ప్రమాదం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. నేల పూర్తిస్థాయిలో ఆరితే వేసవి దుక్కుల తర్వాత నేలగుల్ల బారేదని, ఈ ఏడాది ఈ స్థితి లేకుండా పోయిందని అంటున్నారు.

వాతావరణం అనుకూలించేనా!

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. రుతుపవనాలు వచ్చినట్లే వచ్చి ముఖం చాటేశాయి. వాతావరణం వ్యవసాయానికి అనుకూలంగా మారలేదు. దీంతో శివారు ప్రాంత రైతులు నారుమడులు పోసేందుకు, వెదజల్లే పద్ధతిన సాగు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఈ నెలాఖరు నాటికి వాతావరణం అనుకూలంగా మారితే ఇప్పటికే నారు మడులు పోసిన ప్రాంతాల్లో జూలై మొదటి వారంలో వరి నాట్లు ప్రారంభమవుతాయని, కాలువ శివారు ప్రాంతాల్లో ఈ నెలాఖరునాటికి నారుమడులు పోయడం ప్రారంభమవుతుందని రైతులు అంటున్నారు.

(5వ పేజీ తరువాయి)

సతమతం అవుతున్నారు.

కన్నెత్తిచూడని రెండు జిల్లాల అధికారులు

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చే నాటికి జిల్లాల విభజన జరగలేదు. తర్వాత ఉమ్మడి కృష్ణా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలుగా ఏర్పడింది. అయితే ప్రస్తుతం విజయవాడ తూర్పు నియోజకవర్గ ప్రజలు ఎన్టీఆర్ జిల్లా వాసులుగా రికార్డులో ఉండగా, వారికి కృష్ణాజిల్లా వణుకూరులో ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు ఉంది. దీంతో రెండు జిల్లాల అధికారులు ఈ ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతకాలం హౌసింగ్ అధికారుల పర్యవేక్షణలో ఈ లేఅవుట్ ఉండగా, ఇప్పుడు వారు కూడా ముఖం చాటేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ లేఅవుట్‌ను వీఎంసీ అధికారులు తమకు అధికారికంగా అప్పగించలేదని వణుకూరు పంచాయతీ అధికారులు తప్పించుకుంటున్నారు. వీఎంసీ కమిషనర్‌గా ధ్యానచంద్ర బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు లే అవుట్ వైపు కన్నెత్తి చూడలేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రెండు జిల్లాల కలెక్టర్లు ఇప్పటి వరకు రాలేదని ఆరోపణ కూడా ఉంది.

నీరు లేక కన్నీళ్లు

కాలనీలో నీటి వసతి కోసం పైపులైన్లు, ట్యాంకులు

సమస్యలతో సహజీవనం

ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సొంతంగా బోరు వేసుకుంటేనే నీరు. వాతావరణం అనుకూలించక విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఇక అంతే సంగతి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఒకరోజంతా కరెంటు లేకపోవడంతో స్థానికులు నానా అవస్థలు పడ్డారు.

మట్టి రోడ్లే దిక్కు

కాలనీలో ప్రధాన రహదారితో పాటు వీధుల్లో మట్టి రోడ్లు వేశారు. ప్రస్తుతం ఈ రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వర్షాకాలం బురదతో నిండిపోయి అడుగుతీసి అడుగు వేయడానికి స్థానికులు భయపడుతున్నారు. దీనికి తోడు కాలనీలో భారీ వాహనాలు వెళ్తుండటంతో రోడ్లు గోతులమయం అయ్యాయి. చినుకు పడితే వాహనాలు జారిపోయేలా ఉన్నాయి. మద్దూరు- గోసాల ప్రధాన రోడ్డు రాళ్లు తేలి అధ్వానంగా తయారైంది.

కరెంట్ కష్టాలు

లే అవుట్‌లో వీధి దీపాలు అక్కడక్కడ కనిపిస్తాయి. వాటిలో ఎన్ని వెలుగుతాయో చెప్పలేని పరిస్థితి. పాముల సంచారం ఎక్కువగా ఉండటంతో రాత్రి వేళల్లో బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. కాలనీలో కొన్ని చోట్ల కరెంటు లైన్లు ఉన్నా వాటికి విద్యుత్ సరఫరా ఇవ్వలేదు.

ఎక్కడి మురుగు అక్కడే..

కాలనీ రోడ్లు, డ్రెయిన్లు లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. రోజుల తరబడి నిల్వ ఉండటంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. దోమలకు ఆవాసంగా మారుతోంది. వీటికి తోడు పిచ్చి మొక్కలతో ఆ ప్రాంతం అడవిని తలపిస్తోంది.

బస్సు కోసం పరుగులు

మద్దూరు వరకు 121 ఎం బస్ సర్వీస్ నడుస్తోంది. ఈ కాలనీ వాసులకు ఈ బస్సే ఆధారం. ప్రయాణికులు ఉన్నచోట బస్సు ఆపకుండా ఎక్కడో ఆపుతున్నారని, అక్కడకు పరుగులు తీయాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక చోట స్థిరమైన ప్రదేశంలో బస్సు ఆపేలా, అక్కడ బెంచీలు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గంజాయి బ్యాచ్ సంచారం

వణుకూరు, మద్దూరు మధ్య పోలీస్ బీట్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వణుకూరు దాటితే నిర్మానుష్యంగా ఉంటుంది. ఖాళీ ప్రదేశం, వీధి దీపాలు లేకపోవడంతో గంజాయి బ్యాచ్‌లు, మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు ఇటువైపు తిరుగుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో విధులు నిర్వహించుకుని వచ్చే వారికి వీరి వల్ల ఇబ్బందులు వస్తున్నాయని చెబుతున్నారు.

హౌస్ హోల్ మ్యాపింగ్ కూడా లేదు

ఈ కాలనీలో నివసిస్తున్న వారంతా తూర్పు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారే. ఇక్కడ ఉన్న వారందరికీ విజయవాడలోని సచివాలయాల్లో మ్యాపింగ్ అయినట్లు చెబుతున్నారు. ఇక్కడికి వచ్చిన తర్వాత వణుకూరు సచివాలయంలో మ్యాపింగ్ చేయించుకోవాలని అధికారులు చెప్పగా, అక్కడకు వెళితే ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. రెండు జిల్లాల అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	102, 110, 121
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

పండ్లతోటల పెంపకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలి

గన్నవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరంలో నూరు శాతం రాయితీ ద్వారా పండ్లతోటలు, పూలమొక్కలు సాగు చేసుకొనేందుకు అర్హులైన రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్ ఆర్ ఈ జీఎస్ ఏపీవో రాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జాబ్‌కార్డు ఉండి ఐదెకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు అర్హులన్నారు. మామిడి, బత్తాయి, నిమ్మ, దానిమ్మ, జామ, తైవాన్, సపోట, కొబ్బరి, నేరేడు, సీతాఫలం, ఆపిల్ బేర్, చింత, అంజూర, అవకాడో, డ్రాగన్ ఫ్రూట్స్, మునగ, గులాబి, మల్లెమొక్కలు లభ్యవుతాయని తెలిపారు. ఇతర వివరాలకు గ్రామాల్లోని ఎఫ్ఏలను గాని, ఉపాధి హామీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.











టీడీపీ కార్యాలయం ప్రారంభం నేడు

కంకిపాడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సెంటర్‌లో నేడు తెలుగుదేశం పార్టీ కంకిపాడు కార్యాలయం ప్రారంభించనున్నట్లు టీడీపీ కంకిపాడు గ్రామ అధ్యక్షులు చిట్టూరి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ, ప్రజలకు పార్టీ నాయకులు అందుబాటులో ఉండేందు కు అవసరమైన కార్యాలయం ఏర్పాటు చేయాలంటూ టీడీపీ సీనియర్ నాయకులు హరికృష్ణ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. తక్షణం స్పందించి పార్టీ కార్యాలయం ఏర్పాటుకు సహకరించారని తెలియజేశారు. అదే విధంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ జన్మదిన వేడుకలను పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్ గోగినేని వెంకట రమణ, కొండా నాగేశ్వరరావు, పులి శ్రీనివాసరావు, ఏనుగ జయప్రకాష్, కాకుమాను రమేష్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పామర్రు నియోజకవర్గ పరిశీలకులుగా దేవినేని రాజా



టీడీపీ పామర్రు నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకులుగా కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజాను తెలుగుదేశం పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మంగళవారం రాజా మాట్లాడుతూ, పామర్రు నియోజవకర్గంలో 2024 ఎన్నికల్లో పార్టీ అత్యంత భారీ మెజారిటీతో గెలుపొందిందని, అందుకు అనుగుణంగా పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా కృషి చేస్తానన్నారు.











































రైతులకిచ్చే ప్లాట్ల స్థలాలను పరిశీలిస్తున్న ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

● అధికారులకు ఏడీసీ సీఎండీ లక్ష్మీపార్థసారథి ఆదేశాలు

విజయవాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాజధానికి భూములిచ్చిన రైతులకిచ్చే ప్లాట్లను అభివృద్ధి చేసి వాటిల్లో మౌలిక సదుపాయాల విషయంలో అధికారులు శ్రద్ధ చూపాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీ పార్థసారథి ఆదేశాలు జారీచేశారు. మంగళవారం జోన్-2,7ను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. జోన్-7లో కొండమరాజుపాలెం, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం గ్రామాల్లో 2.6 వేల ఎకరాల్లో చేపట్టాల్సిన లే అవుట్ల అభివృద్ధికి ఇంజినీరింగ్ అధికారులు సమాయత్తం కావాలన్నారు. రాజధాని రైతులకు అభివృద్ధి చేసి ఇవ్వాల్సిన లే అవుట్లలో కనీస మౌలిక సదుపాయాలైన రోడ్లు, మంచినీటి, భూగర్భ వర్షపునీటి పారుదల వ్యవస్థ నిర్మాణాలకు ముడిసరుకును కొనుగోలు చేయాలని చీఫ్ ఇంజినీరు సీహెచ్ ధనుంజయను ఆదేశించారు. జోన్-1లోని అబ్బరాజుపాలెం, నెక్కల్లు, తుళ్లూరు, శాఖమూరు గ్రామాల పరిధిలో 2.85 వేల ఎకరాల్లో జరుగుతున్న మౌలిక సదుపాయాల పనులను పరిశీలించారు. ఏడీసీ చీఫ్ ఇంజినీర్ ఎం ప్రభాకర్, ఐపీడీ హెడ్ కేవీ గణేష్‌బాబు, ఎస్‌ఈ ఆర్ హనుమంతరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, డీఈ పీ వెంకటేశ్వర్లు అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష అవుట్ సోర్సింగ్

ఉద్యోగుల బదిలీలకు దరఖాస్తులు

మచిలీపట్నం టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షలో అవుట్ సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలని అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఆర్ కుముదినిసింగ్ తెలిపారు. ఎక్స్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్, క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్లు, మండల లెవెల్ అకౌంటెంట్లు, సైట్ ఇంజనీర్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఆఫీసు సబార్డినేటర్లు బదిలీలకు ఈనెల 18 నుంచి 21 వరకు మచిలీపట్నంలోని జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలని ఏపీసీ తెలిపారు. దరఖాస్తులు పరిశీలించి సీనియారిటీ లిస్టులు తయారు చేసి 24న జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో ప్రదర్శిస్తామన్నారు. సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలుంటే ఈనెల 27లోగా తెలియజేయాలన్నారు. ఫైనల్ సీనియారిటీ లిస్టును ఈనెల 28న ప్రదర్శిస్తామన్నారు. రిక్వెస్టు, మ్యూచువల్ బదిలీల కౌన్సెలింగ్ ఈనెల 30 నుంచి జులై2 వరకు సమగ్రశిక్ష కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు.

1458 మంది హాజరు...

కృష్ణాజిల్లాలో మెగా డీఎస్సీకి 1504 మంది అభ్యర్థులకు గాను 1458 మంది మంగళవారం పరీక్షలకు హాజరైనట్టు డీఈవో పీవీజే రామారావు తెలిపారు. 46 మంది గైర్హాజరయ్యారన్నారు.

యోగాపై ఓల్గా ఆర్చరీ అకాడమీ ప్రత్యేక గీతం

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఓల్గా ఆర్చరీ అకాడమీ ప్రెసిడెంట్ చెరుకూరి సత్యనారాయణ నేతృత్వంలో యోగాపై రూపొందించిన ప్రత్యేక గీతానికి సంబంధించిన పూర్తి నిడివి గల వీడియోను శాప్ వైస్ ఛైర్మన్, ఎండీ పీ ఎస్ గిరీష శాప్ కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని యోగాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. ఈ నెల 21న విశాఖపట్నంలో జరగనున్న యోగాంధ్ర ద్వారా ప్రపంచ స్థాయి రికార్డును నమోదు చేసేందుకు ప్రభుత్వం సంకల్పించడం జరిగిందన్నారు. ఏవో రమావత్ వెంకట రమణ నాయక్, పీఎస్‌వో ఎస్. వెంకటరమణ, చెరుకూరి సత్యనారాయణ పాల్గొన్నారు.





గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకుల మృతి

ఫిరంగిపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ఫిరంగిపురం సమీపంలోని మెరికపూడి గ్రామం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృత్యుపాలయ్యారు. వేగంగా వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులలో ఇద్దరు మృతి చెందగా మరో యువకుడు గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం కృష్ణాజిల్లా కోడూరు మండలం నారే పాలెం గ్రామానికి చెందిన క్రాంతి కుమార్ తన సమీప బంధువైన సుదర్శన్‌తో కలసి బుల్లెట్ మోటార్ సైకిల్ కొనుగోలు నిమిత్తం మెకానిక్ గుమ్మడి దుర్గాప్రసాదును తీసుకొని చిత్తూరు జిల్లా పీలేరుకు వెళ్లారు. అక్కడ పాత బుల్లెట్‌ను కొనుగోలు చేసి అదే బుల్లెట్‌పై తిరిగి విజయవాడ వస్తుండగా మార్గమధ్యంలో గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం మెరికిపూడి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొట్టి ఆగకుండా వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో బుల్లెట్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు కిందకు పడిపోయారు. వీరిలో సుదర్శన్ (21) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన ఇద్దరిని 108 అంబులెన్స్‌లో నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బైక్ మెకానిక్ దుర్గాప్రసాద్ మృతి చెందాడు. తీవ్ర గాయాలతో ఉన్న క్రాంతి కుమార్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రిలో క్రాంతి కుమార్ ద్వారా విషయం తెలుసుకున్న ఫిరంగిపురం పోలీసులు వీరి ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలింపు చేపట్టారు. ఫిరంగిపురం సీఐ కే రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశ్రామిక అభివృద్ధికి సహకారం

● పారిశ్రామికవేత్తలతో ముఖాముఖిలో కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ



పారిశ్రామికవేత్తలతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

పెనమలూరు, జూన్17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం తరపున అన్ని విధాల సహకరిస్తామని, జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నడిపేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అవకాశాలను అందిపుచ్చుకొని పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు రావాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం జిల్లా పరిశ్రమల శాఖ (డీఐసీ) ఆధ్వర్యంలో తాడిగడపలోని వందడుగుల రోడ్డులోని అన్నే వారి కల్యాణమండపంలో పారిశ్రామికవేత్తలతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పేందుకు అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను జిల్లా యంత్రాంగం తరపున సహకరించి ప్రోత్సహిస్తామన్నారు. ఎవరికైనా సమస్యలుంటే పరిష్కరించి త్వరగా అనుమతులు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. అనంతరం పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను అడిగి తెలుసుకొన్నారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ జిల్లాను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ముందుకు రావడం సంతోషదాయకమని పారిశ్రామికవేత్తలు అన్నారు. డీఐసీ జీఎం ఆర్ వెంకట్రావు, ఉయ్యూరు ఆర్డీవో హేలా షారోన్, ఎల్‌డీఎంసీ రవీంద్రారెడ్డి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఆశారాణి, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పీ భాస్కరరావు, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ ఛైర్ పర్సన్ వీ నాగలక్ష్మి, అధినేత శ్రీనివాస సతీష్, ఏపీ ఎంఎస్ఎంఈ సంఘం అధ్యక్షుడు బాయన వెంకట్రావు, వీఏసీడీసీఎల్ సీఎండీ అన్నే శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేగవంతంగా గృహనిర్మాణ పనులు

మచిలీపట్నం: జిల్లాలో గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని గృహనిర్మాణ సంస్థ అధికారులు, ఆయా మండలాల ప్రత్యేక అధికారులను కలెక్టర్ బాలాజీ ఆదేశించారు. గృహనిర్మాణంలో పురోగతిపై కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాలవారీగా సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో గృహనిర్మాణంలో పురోగతి సంతృప్తస్థాయిలో లేదన్నారు. 15రోజుల క్రితం నిర్వహించిన సమీక్షలో ఇచ్చిన టార్గెట్‌ను పూర్తిచేయలేకపోయారన్నారు. జిల్లాలో గోడలనిర్మాణ దశలో 8,079 గృహాలు, శ్లాబు దశ వరకు చేరుకున్న గృహాలు 2,109, శ్లాబు వేయడానికి సిద్ధంగా ఉన్న గృహాలు 446 ఉన్నాయన్నారు. గుడివాడ, నందివాడ, గూడూరు, పెదపారుపూడి, కోడూరు, పామర్రు, మొవ్వ, చల్లపల్లి, అవనిగడ్డ మండలాలు గృహనిర్మాణంలో వెనుకబడి ఉన్నాయన్నారు. లబ్ధిదారులు, కాంట్రాక్టర్లతో అధికారులు మాట్లాడి పనులు వేగవంతం చేయాలనర్నారు. సంస్థ పీడీ వెంకట్రావ్, అధికారులు పాల్గొన్నారు.

పశుబొట్లపాలెంలో అనుమానాస్పద మృతి

● హత్యేనంటూ కుటుంబసభ్యులు, దళిత సంఘాల ఆందోళన



వెంకట్రావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న గుడివాడ డీఎస్పీ ధీరజ్

గుడ్లవల్లేరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం కౌతవరం శివారు గ్రామం పశుబొట్లపాలెం దళితవాడకు చెందిన రేమల్లె వెంకట్రావు (45) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. 20 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్న వెంకట్రావు, భార్యతో మనస్పర్థల కారణంగా విడిపోయి, ఒంటరిగా జీవిస్తూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి మద్యం మత్తులో గ్రామంలో కొందరితో లేదా ట్రాక్టర్ యజమానితో గొడవపడినట్టు స్థానికులు చెబుతున్నారు. మంగళవారం ఉదయం 6.30 గంటల సమయంలో గోట్రు సాహితి అనే గృహిణి చెత్త పడేసేందుకు బయటకు వచ్చి, రోడ్డు పక్కన పంట బోదెపై రక్తపు గాయాలతో ఉన్న వెంకట్రావు మృతదేహాన్ని గుర్తించింది. వెంటనే వెళ్లి తన భర్త దీపక్‌కు చెప్పగా, అతడు చుట్టుపక్కలవారికి, మృతుడి సోదరుడు గంగాధరరావుకు, గుడ్లవల్లేరు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని, గుడివాడ రూరల్ సీఐ సర్వేశ్వరరావుకు సమాచారం అందించారు. గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ నేతృత్వంలో క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లతో దర్యాప్తు ప్రారంభమైంది. కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. జిల్లా ఎస్పీ గంగాధర్ మార్గదర్శకత్వంలో గుడివాడ టౌన్ సీఐ శ్రీనివాస్‌తో సహా పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుడి సోదరుడు గంగాధరరావు, గ్రామంలోని పలువురిపై హత్య అనుమానంతో మంగళవారం ఫిర్యాదు చేశాడు. కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నేతలు హత్య జరిగిందని ఆరోపిస్తూ, నిందితులను అరెస్టు చేసి కఠిన శిక్ష విధించాలని డీఎస్పీని కోరారు. పోలీసులు కేసు నమోదులో జాప్యం చేస్తున్నారని, దర్యాప్తును పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపిస్తూ, కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాలు గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఎఫ్ఐఆర్ పకడ్బందీగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ ధీరజ్ చట్టపరమైన దర్యాప్తు ద్వారా నిందితులకు శిక్ష పడేలా చేస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం రాత్రి గంగాధరరావు ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదై, మృతదేహానికి శవపంచనామా అనంతరం గుడివాడ ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పాత గొడవలు, ఇతర కారణాలతో వెంకట్రావు హత్యకు గురై ఉంటాడని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, దర్యాప్తు ఫలితాల కోసం స్థానికులు ఎదురుచూస్తున్నారు. జిల్లా ఎస్పీ గంగాధర్ నేతృత్వంలో గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్, గుడివాడ రూరల్ సీఐ సోమేశ్వరరావు, గుడివాడ టౌన్ సీఐ శ్రీనివాస్, గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ మరికొందరు టీమ్ దర్యాప్తు చేస్తున్నారు.



జలయోగా శిక్షణను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

జలయోగా ప్రదర్శనకు ఏర్పాట్లు

అవనిగడ్డ/నాగాయలంక, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా నిర్వహించనున్న జలయోగాను విజయవంతం చేయటానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌లో అటుపోట్లను, అలల తాకిడిని అధిగమిస్తూ నీటిపై తేలియాడుతూ యోగాసనాల ప్రదర్శనను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కలెక్టర్ డీకే బాలాజీ ఏర్పాటు చేయగా, అవనిగడ్డ, పరిసర ప్రాంతాల నుంచి ఔత్సాహికులు జలయోగాను సాధన చేస్తున్నారు. మంగళవారం విజయవాడ నుంచి అవారా బృందం డాక్టర్ కాట్రగడ్డ అజయ్ నేతృత్వంలో నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం ఘాట్ వద్దకు వచ్చి నదిలో తేలుతూ ఆసనాలు వేసే విధానంలో మెళకువలు నేర్పించారు. అవనిగడ్డ, నాగాయలంక ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, మత్స్యకారులు పాల్గొంటుండగా, మంగళవారం సాయంత్రం శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌కు వచ్చిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దాదాపు రెండు గంటలపాటు అక్కడే ఉండి జలయోగా సాధనను పర్యవేక్షించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి పీ సాయిబాబు, మాజీ సర్పంచ్ మండవ బాలవర్థిరావు, తహసీల్దార్ హరనాథ్, పంచాయతీ కార్యదర్శి జరుగు పవన్ కుమార్, మత్స్యశాఖ ఏడీ ప్రతిభ, ఆయుష్ శాఖ నుంచి ట్రైనర్లు నాగరాజు, శ్రీనివాసరావు, శేష ప్రసన్న, మెడికల్ అధికారులు డాక్టర్ మానస, దుర్గారాణి, మాధవి, సౌజన్య, రాగలత, నాగాయలంక పీహెచ్‌సీ వైద్యాధికారి ఇంద్రకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పీల్చేగాలి స్వచ్ఛంగా ఉండాలి

జాతీయ పరిశుభ్రమైన గాలి కార్యక్రమంపై 4న వర్క్‌షాప్: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియ

కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాంధ్ర సాకారానికి, కాలుష్య రహిత సమాజానికి మనం పీల్చే గాలి స్వచ్ఛంగా ఉండటం కీలకమని, వినూత్న విధానాలతో విజయవాడ నగరం వాయు కాలుష్యం బారిన పడకుండా సమష్టి కృషి అవసరమని, ఇందుకు భాగస్వామ్య పక్షాలు చేతులు కలపాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జాతీయ శుద్ధ వాయు (ఎన్‌సీఏపీ) అమలుపై సమీక్షించేందుకు నగర ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం జరిగింది. కాలుష్య నియంత్రణ, నగరపాలక సంస్థ, రవాణా, పరిశ్రమలు తదితర శాఖలు వాయు నాణ్యతను పెంచేందుకు చేపట్టిన పనులు, వాటిలో పురోగతిపై సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణకు మార్గనిర్దేశం చేశారు. నగరం నలువైపులా హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్ల డేటాను ఎప్పటికప్పుడు విశ్లేషించి, దుమ్మూధూళి వ్యాప్తిచెందకుండా గాలిలో పీఎం 10 సూక్ష్మ ధూళికణాలను లక్ష్యాల మేరకు తగ్గించే కార్యక్రమాలు పటిష్ఠంగా అమలయ్యేలా చూడాలన్నారు. 2024-25లో పీఎం 10 సూక్ష్మ ధూళికణాల పరిమాణం 64 పీజీ/ఎంగా నమోదైందని, దీన్ని బాగా తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఐటీఎంఎస్ పనులను త్వరగా పూర్తిచేయాలి

సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణతో వాహనాల సాఫీ ప్రయాణంతో గాలి కాలుష్యం మోతాదును తగ్గించవచ్చని, ఇందుకు ఉపయోగపడే ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐటీఎంఎస్) పనులను రూ.5 కోట్లతో చేపట్టడం జరిగిందని, ఈ పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు అడ్డుకట్టవేయండి

సింగిల్ యూజ్, ప్లాస్టిక్‌ను ఎక్కడా ఉపయోగించకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా షాపింగ్ కాంప్లెక్సులు, షాపింగ్ జోన్లు, రైతు బజార్లపై దృష్టిపెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పీసీబీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పీ శ్రీనివాస్, డీసీపీ ఎం కృష్ణమూర్తి నాయుడు, వీఎంసీ సూపరింటెండింగ్ ఇంజినీర్ (ప్రాజెక్టులు) పీ సత్యకుమారి, ఏపీఐఐసీ జెడ్ఎం కే బాబ్జి, వీటీపీఎస్ ఎస్‌ఈ ఉమామహేశ్వరరావు, ఆర్టీవో ఆర్ ప్రవీణ్, జిల్లా పరిశ్రమల అధికారి బీ సాంబయ్య, డీఎస్‌వో ఏ పాపారావు, డీఏవో డీఎంఎఫ్ విజయకుమారి పాల్గొన్నారు.

కళాత్మక యోగా అదరహో..

యోగాంధ్రలో భాగంగా జిల్లాలో మూడు రోజుల పాటు వివిధ అంశాల్లో యోగాసనాలపై నిర్వహించిన రాష్ట్రస్థాయి కళాత్మక యోగా పోటీలు అదరహో... అనిపించాయని, న్యాయ నిర్ణేతల సమక్షంలో పారదర్శకంగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో రాష్ట్రస్థాయిలో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానోత్సవానికి చేసిన ఏర్పాట్లపై కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18న బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రస్థాయి బహుమతుల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారికి ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి డాన్‌బాస్కో స్కూల్ నందు న్యాయ నిర్ణేతల సమక్షంలో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. యోగా నృత్యం, యోగా చిత్రలేఖనం, యోగా ఫొటోగ్రఫీ, యోగా స్లోగన్, వంటి అంశాలపై రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించామన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు 15 కేటగిరిల్లో జూనియర్, యంగ్, సీనియర్ గ్రూపుల్లో విజేతలు మండల, జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి చేరుకున్నారన్నారు. ఈ బహుమతుల ప్రదానోత్సవంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొంటారని, అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీఈవో యూవీ సుబ్బారావు పాల్గొన్నారు.

యోగాసనలతో నిత్య నూతనోత్సహం

సత్యనారాయణపురం: యోగాసనాలతో ప్రతి ఒక్కరూ నిత్య యవ్వనంతో నూతనోత్సాహంతో ఆరోగ్యవంతులుగా జీవించగలుగుతారని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర మహోత్సవాల్లో భాగంగా బీఆర్‌టీఎస్ రోడ్డులో మంగళవారం జిల్లా అధికారులు, వీఎంసీ ఆధ్వర్యంలో జరిగిన యోగాంధ్రలో వాకర్స్ క్లబ్, చాంబర్ ఆఫ్ ఇంటర్‌నేషనల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యోగాసనాలు ప్రజల జీవనశైలిలో భాగం చేసేందుకు యోగాంధ్ర ఎంతగానో దోహదపడుతుందన్నారు. వాకర్స్ ఇంటర్‌నేషనల్ గవర్నర్ టీ హనుమంతరావు, జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ ప్రతినిధి జే శివ, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నేతలు వేమురి బాబూరావు, అమర్‌నాథ్, ఏ విజయలక్ష్మి, వీఎంసీ అదనపు కమిషనర్ చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని యోగాశిక్షకులు పాల్గొన్నారు.

వరుస చోరీలకు పాల్పడిన దొంగలు అరెస్టు

● డీఎస్పీ చలసాని శ్రీనివాస్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చలసాని శ్రీనివాస్

గన్నవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు దొంగతనాలకు పాల్పడిన నలుగురు అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ.14లక్షల విలువైన మోటార్ సైకిళ్లు, 60 గ్రాముల బంగారు ఆభరణాలు, 600 గ్రాముల విలువైన వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ చలసాని శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులకు కేసు వివరాలను వెల్లడించారు. మే 3న పొట్టిపాడు రామాలయం వీధిలో బాణాల సుభాషిణి అనే మహిళ నిద్రిస్తుండగా తెల్లవారు ఝామున గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి మెడలోని 5 కాసుల బంగారు నానుతాడు దొంగిలించినట్లు ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం శివారు వేగవరానికి చెందిన పారేపల్లి శేషు, పోలవరపు నాగదుర్గా ప్రసాద్, దుగ్గిరాల శివరామకృష్ణను గుర్తించినట్టు తెలిపారు. ప్రధాన ముద్దాయి శేషు అదుపులోకి తీసుకుని 5 కాసుల బంగారం గొలుసుతో పాటు ఒక మోటార్ సైకిల్‌ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏలూరు జిల్లాకు చెందిన దత్తి నవీన్, పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన గుత్తుల రవికుమార్ సాయి శ్రీరామ్ ముగ్గురు బృందంగా ఏర్పడి వరుస చోరీలకు పాల్పడినట్లు చెప్పారు. ఆత్కూరు, వీరవల్లి, గన్నవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. వీరి కదలికపై సమాచారం అందుకున్న ప్రత్యేక బృందం ఈ ముగ్గురినీ, చోరీ చేసిన బైకును పొట్టిపాడు టోల్‌గేటు దగ్గర అదుపులోకి తీసుకుని విచారించగా 4 బైకులు దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నారు. పెదపాడు, కైకలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చేసిన దొంగతనాలకు చోరీ సొత్తు రికవరి చేసినట్టు తెలిపారు. ఇప్పటికే వీరు పలు కేసుల్లో అరెస్టు అయి జైలుకు వెళ్లి వచ్చారన్నారు. వీరి నుంచి రూ.10 లక్షలు విలువైన మోటార్ సైకిళ్లు, బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని గన్నవరం కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు డీఎస్పీ చలసాని శ్రీనివాస్ తెలిపారు. దర్యాప్తు చేసిన హనుమాన్ జంక్షన్ సీఐ కే వీవీఎన్ సత్యన్నారాయణ, ఎస్సై చావా సురేష్, సిబ్బంది సిగంశెట్టి నరేష్, కొడాలి ఆంజనేయులు, నక్కా మహేశ్వరరావు, ఆవుటపల్లి రామారావు, బెజగం మహేష్‌ను అభినందించారు.

కుమ్మమూరు డీపీ పునర్నిర్మాణం

బాధ్యత తీసుకున్న సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రామినేని



కుమ్మమూరు చానల్ రెండు వైపులా పునర్నిర్మించిన డీపీలు

తోట్లవల్లూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కుమ్మమూరు రైతుల పంట పొలాలకు బందరు కాలువ నుంచి సాగునీరు అందించే డిస్ట్రిబ్యూటరీ పాయింట్ (డీపీ)ని ఎట్టకేలకు పునర్నిర్మించారు. కాలువకు సాగునీరు విడుదలయ్యేలోపు డీపీకి రెండు వైపులా కాంక్రీటు పిల్లర్లను నిర్మించి కొత్త తూములు ఏర్పాటు చేసి గేటు ఏర్పాటు చేశారు. మే 21న 'తప్పేశారు వదిలేశారు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ డీపీ ఐదారేళ్లుగా పూర్తిగా శిథిలమై బందరు కాలువలోని నీరు కుమ్మమూరు పొలాల వైపు వృథాగా పోతుండేది. పాత డీపీ గోడలు పగిలిపోవటంతో షెట్టర్ పైకి లేపకున్నా పక్క పగుళ్ల నుంచి పెద్దఎత్తున కాలువ నీరు పొలాలను ముంచెత్తేది. దీంతో రైతుల పరిస్థితి అతివృష్టి, అనావృష్టిగా ఉండేది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించటం, పెనమకూరు నీటి సంఘానికి కుమ్మమూరుకు చెందిన రామినేని రామ కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. రైతులు ఆయనకు కుమ్మమూరు డీపీ దుస్థితిని వివరించటంతో నిధులు రాలేదని అయినా తాను డీపీని ఏదో విధంగా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దాంతో మే నెలలో రామ కోటేశ్వరరావు ఆదేశంతో ఇరిగేషన్ అధికారులు పాత డీపీని ఎక్స్‌కవేటర్‌తో తొలగించేశారు. కొందరు రైతులను చేయూతనివ్వమని కోరటంతో వివాదాస్పదం అయింది. రోజులు గడవటంతో ఆంధ్రజ్యోతి మే 21న తప్పేశారు వదిలేశారు శీర్షికతో వార్త ప్రచురించటంతో రామ కోటేశ్వరరావు స్పందించి సొంత నిధులను అధికారులకు అందించి డీపీని పునర్నిర్మింపచేశారు. దీంతో ఆరేళ్ల నుంచి ఉన్న డీపీ సమస్య తీరింది.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]


మాడపాటి గెస్ట్‌హౌస్, జమ్మిదొడ్డిలలో
దుర్గమ్మ ప్రసాదాల కౌంటర్లు

» ఈవో శీనానాయక్ వెల్లడి



రైల్వేస్టేషన్‌లోని దుర్గమ్మ ప్రసాదాల కౌంటర్‌ను పరిశీలిస్తున్న ఈవో

ఇంద్రకీలాద్రి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : దుర్గగుడికి వచ్చే భక్తులకు మరిన్ని సేవలు అందించే క్రమంలో భాగంగా వన్‌టౌన్ తారాపేటలోని మాడపాటి గెస్ట్‌హౌస్, బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డి ప్రాంగణాలలో దేవస్థానం లడ్డూ ప్రసాదం విక్రయించే కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్టు ఈవో వీకే శీనానాయక్ తెలిపారు. మంగళవారం ఆయన విజయవాడ రైల్వేస్టేషన్‌లోని తూర్పు వైపు ఎంట్రన్స్‌లో ఉన్న దుర్గమ్మ ప్రసాదాల విక్రయ కౌంటర్‌ను పరిశీలించారు. వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కౌంటర్‌లో రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు.



ముఖ్యమంత్రిని కలిసిన పెన్మెత్స

సుపరిపాలన ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబును సెక్రటేరియట్‌లో ఎస్.ఎల్.వి. గ్రూప్ చైర్మన్ పెన్మెత్స శ్రీనివాస రాజు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. (భారతీనగర్)

సూపర్ సిక్స్ అమలు ఆరంభం
వైసీపీ, జగన్ పతనం ప్రారంభం : నెట్టెం

జగ్గయ్యపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికలహామీలైన సూపర్ సిక్స్ పథకాల అమలు ప్రారంభంతో వైసీపీ, జగన్ పతనం ఆరంభమైందని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. చంద్రబాబు సంపద సృష్టించి పేదలకు పంచుతుంటే.. సైకో, శాడిస్ట్ జగన్ సంపదను దోచుకుని అప్పులు చేసి పథకాలు అమలు చేశాడని ధ్వజమెత్తారు. ఆయన మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, తల్లికి వందనం పథకాన్ని ఎగతాళి చేసిన జగన్‌కు విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి ఒకేసారి నగదు జమ కావటంతో దిమ్మతిరిగిందని చెప్పారు. నవరత్నాల పేరుతో నవమోసాలు చేసిన జగన్‌కు ప్రజలు గట్టి తీర్పు ఇచ్చారన్నారు. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ, ఆడబిడ్డ నిధి, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రభుత్వం కల్పించబోతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే గత ప్రభుత్వ విధ్వంసాలు, అరాచకాలను అధిగమించి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తుందని నెట్టెం చెప్పారు. సమావేశంలో కొఠారు సత్యనారాయణ ప్రసాద్, గింజుపల్లి రమేష్, ముల్లంగి రామకృష్ణారెడ్డి, మేకా వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు, అన్వర్, కె.నరసింహారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.


ఖాతాలు డబ్బులు పడలేదని చెబుతున్న తల్లులు

ఆన్‌లైన్ తప్పిదాలు!

» పలువురికి ఖాతాల్లో పడని తల్లికి వందనం నగదు
» లబోదిబోమంటున్న లబ్ధిదారులు

నందివాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'తల్లికి వందనం' డబ్బులు కొంత మంది తల్లుల ఖాతాల్లో పడకపోవటంతో వారు లబోదిబోమంటున్నారు. ఇద్దరు పిల్లలు ఉన్న తల్లులకు ఒక్కరికే డబ్బులు పడటం, గత ప్రభుత్వంలో పడిన విద్యార్థిని, విద్యార్థులకు తల్లుల ఖాతాల్లో డబ్బులు పడకపోవటంతో దిక్కుతోచని స్థితిలో ఆందోళన చెందుతున్నారు. నందివాడ మండలం దండిగానపూడి గ్రామంలో తల్లికి వందనం డబ్బులు సుమారు 15 మందికి పడకపోవటంతో లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. తమకు 30 సెంట్లు పొలం ఉంటే ఏకంగా 28 ఎకరాలు పైబడి పొలం ఉన్నట్టు ఆన్‌లైన్‌లో చూపిస్తుందని, పలువురికి ఎకరాలకు పైబడి భూములు ఉన్నాయని చూపడంతో వారందరూ ఉలిక్కిపడుతున్నారు. తమకు ఉన్నది 30, 40 సెంట్లు మాత్రమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 30లోగా తల్లుల ఖాతాల్లో డబ్బులు పడని వాళ్లు సచివాలయంలో సరిచేసుకోండి అంటూ మంత్రి నారా లోకేశ్ ప్రకటనలు చేస్తుంటే తమ పరిస్థితి ఏంటి అని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వం భూ సర్వేలో చేసిన తప్పిదానికి తాము బాధ్యత వహించాలా.. అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో సరిచేసుకోవాల్సిన తప్పిదాల సమయం పొడిగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ గురుమూర్తిరెడ్డిని వివరణ కోరగా, ఆన్‌లైన్ తప్పిదాలు జరిగిన విషయం నిజమేనని, తల్లికి వందనం లబ్ధిదారులు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే వారిపేర ఎంత భూమి ఉంటే అంతవరకు రాసి ఇస్తామన్నారు. ఈ విషయం ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లగా, దరఖాస్తుదారులకు వెంటనే వారి పొలం పరిశీలించి సర్టిఫికెట్ ఇవ్వండి, ఆ సర్టిఫికెట్ సచివాలయంలో ఆన్‌లైన్ చేసుకుంటే తల్లుల అకౌంట్‌లో తల్లికి వందనం నగదు పడతాయన్నారు.



ప్రాజక్టు బ్రోచర్లను విడుదల చేస్తున్న సంస్థ సీఎండీ రామచంద్రరావు, సభ్యులు

ఆకునూరులో శ్రీ భ్రమర హోమ్స్ సిగ్నేచర్ ప్రాజక్ట్‌కు శ్రీకారం

గుంటూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వినూత్న ఆలోచనలతో దూసుకుపోతున్న శ్రీ భ్రమర హోమ్స్ విజయవాడ నగరంలోని ఆకునూరు వద్ద సిగ్నేచర్ ప్రాజక్టుకు శ్రీకారం చుట్టినట్టు సంస్థ చైర్మన్, ఎండీ గళ్లా రామచంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా బెంజ్ సర్కిల్ జ్యోతి కన్వెన్షన్ సెంటర్‌లో శ్రీ భ్రమర హోమ్స్ గ్రాండ్ ప్రీ లాంచ్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. సీఎండీ గళ్లా రామచంద్రరావు, డైరక్టర్ మారం చంద్రశేఖర్‌లు నూతన ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ, 'శ్రీ భ్రమర హోమ్స్'లో విల్లాస్, విల్లా ప్లాట్స్ ప్లాన్ చేసినట్టు తెలిపారు. అత్యాధునిక సౌకర్యాలతో పాటు నిర్మాణ రంగంలో కొత్తదనం సృష్టించాలనే ఆశయంతో, 2015 నుంచి 35కి పైగా ప్రాజెక్టులతో, 10 వేల మందికి పైగా కుటుంబాల సొంతింటికల నెరవేర్చినట్టు తెలిపారు. కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో వేలాది కుటుంబాలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు అందించి, స్థిరాస్తి రంగంలో తమదైన ముద్ర వేసుకున్నట్టు పేర్కొన్నారు.

దయనీయ స్థితిలో కాజ్‌వేలు, బ్రిడ్జిలు

వారధులకు కష్టకాలం!

ఆంధ్రజ్యోతి పరిశీలన

» తెలుగు రాష్ట్రాల ప్రజల రాకపోకలకు ప్రధాన మార్గాలు
» వంతెనలకు అప్రోచ్‌లు లేక వాహనదారుల ఇక్కట్లు
» ట్రాఫిక్ కష్టాలు.. వరదలొస్తే రాకపోకలు బంద్..
» శాశ్వత మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి సారించాలి


అప్రోచ్ లేనందున నిరుపయోగంగా ఉన్న కూడలి వంతెన


మునేటి వరదలో మునిగిన లింగాల కాజ్‌వే (ఫైల్‌ఫొటో)

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల/వత్సవాయి/జగ్గయ్యపేట): అన్నీ కృష్ణా ఉపనదులైన వైరా, మున్నేరు, పాలేటిలపై కాజ్‌వేలు, బ్రిడ్జిలు. తెలుగురాష్ట్రాల ప్రజల రాకపోకలకు ఇవే వారధులు. దశాబ్దాల క్రితం వీటిని నిర్మించారు. నేడు శిథిల స్థితికి చేరుకుంటున్నాయి. వరదలొస్తే ప్రజల కష్టాలు చెప్పలేకుండా ఉంటున్నాయి. దెబ్బతిన్న కాజ్‌వేల పరిస్థితి దయనీయంగా ఉంది. నామమాత్రంగా చేసిన మరమ్మతులు పనిచేయటం లేదు. శాశ్వత ప్రాతిపదికన పనులు చేయకపోవటంతో రాకపోకలకు కష్టంగా మారుతోంది. కాజ్‌వేలకు అప్రోచ్‌లు లేకపోవటం ఒక సమస్య అయితే.. లో లెవల్‌లో ఉండటం మరో సమస్య. హై లెవల్ బ్రిడ్జిలు కావాలన్న ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. కానీ ఏవీ కార్యరూపం దాల్చటం లేదు. పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలో తెలుగు రాష్ట్రాలకు రాకపోకలకు దోహదపడే వీటి పునరుద్ధరణకు ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరం ఉంది. కృష్ణా ఉపనదులపై ఉన్న కాజ్‌వేలు, బ్రిడ్జిల దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి ఫోకస్'..

నిరుపయోగంగా వంతెన..

చెవిటికల్లు-వత్సవాయి ఆర్‌అండ్‌బీ రోడ్డులో నందిగామ మండలం కూడలి, వీరులపాడు మండలం పల్లెంపల్లి గ్రామాల మధ్య వైరా నదిపై నిర్మించిన వంతెన ఎనిమిదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. రూ.కోట్ల వ్యయంతో వంతెన నిర్మించినప్పటికీ, కేవలం అప్రోచ్ రోడ్లు వేయనందున ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దాములూరు కూడలి వద్ద వైరా ఏటిలో దశాబ్దాల క్రితం నిర్మించిన లోలెవల్ కాజ్‌వే దెబ్బతింది. వంతెనకు ఎగువ భాగంలో దీనిని నిర్మించడంతో వరద వచ్చినపుడల్లా కాజ్‌వే పూర్తిగా మునిగిపోతోంది. వర్షాకాలంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయి తెలుగు రాష్ట్రాలకు చెందిన 50 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర విభజన తర్వాత తెలుగుదేశం ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ.6.50 కోట్లు మంజూరు చేసింది. 200 మీటర్ల పొడవున వంతెన నిర్మించారు. అప్పట్లో అప్రోచ్‌కు అవసరమైన భూమి సేకరణ విషయంలో రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. అప్పటి నుంచి వంతెన నిరుపయోగంగా ఉంది. కాజ్‌వేనే దిక్కవటంతో వర్షాకాలంలో ప్రజలకు కష్టాలు తప్పటం లేదు. రైతుల అంగీకారంతో భూసేకరణ అంశం కొలిక్కి వచ్చిందని నందిగామ ఆర్డీవో బాలకృష్ణ చెప్పారు. రివైజ్డ్ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని, అనుమతి రావల్సి ఉందని ఆర్‌అండ్‌బీ ఏఈ తెలిపారు.

శిథిలావస్థలో లింగాల కాజ్‌వే..

తెలుగు రాష్ట్రాలను కలిపే చిల్లకల్లు-వైరా రహదారి ముఖ్యమైనది. ఈ మార్గంలో నిత్యం వేలసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అత్యంత రద్దీ ఉండే రహదారిలో వత్సవాయి మండలం లింగాల వద్ద మునేటిపై 1964లో వరద నీరు దిగువకు వెళ్లేలా 56 ఖానాలతో 850 మీటర్ల లోలెవల్ కాజ్‌వే నిర్మించారు. ఒకవైపు భారీ వాహనాల రద్దీ.. మరోవైపు మునేటి వరదలకు ఈ కాజ్‌వే శిథిలావస్థకు చేరింది. భారీగా వరదలు వస్తే ఈ కాజ్‌వేను మూసేస్తున్నారు. వాహనాలను పెనుగంచిప్రోలు-ముక్కపేట దారిలో మళ్లిస్తున్నారు. సింగిల్ రూటు కావటం, అదనంగా పది కిలోమీటర్లు చుట్టూ తిరగాల్సి రావటంతో వాహనదారులు, ప్రజలు అధిక వ్యయప్రయాసలకు గురౌతున్నారు. ఈ నేపథ్యంలో, గతేడాది రికార్డు స్థాయిలో వచ్చిన వరదకు కాజ్‌వే నామరూపాలు లేకుండా ధ్వంసమైంది. రోజుల తరబడి ఈ మార్గం బంద్ అయింది. ప్రస్తుతం రూ.రెండు కోట్లతో కాజ్‌వేకు మరమ్మతులు చేస్తున్నారు.


చిల్లకల్లు - వైరా రూటులో లింగాల కాజ్‌వే

హైలెవల్ వంతెన ఏర్పాటు ఎప్పుడు?

జగ్గయ్యపేట-ముక్త్యాల మార్గంలో అగ్రహారం వద్ద పాలేటిపై ఉన్న లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెన నిర్మించాలన్న ప్రతిపాదన ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది. దశాబ్దాల క్రితం నిర్మించిన అగ్రహారం వంతెన ప్రస్తుతం వాహనాల రద్దీని తట్టుకోలేకపోతోంది. జగ్గయ్యపేట ప్రాంతంలోని పలు సిమెంట్ ఫ్యాక్టరీలు, విశాఖ స్టీల్ ప్లాంట్, పులిచింతల ప్రాజెక్టు, ఇతరత్రా పలు సంస్థలకు ఈ మార్గం ప్రధానమైనది. సూర్యాపేట జిల్లా దొండపాడు, మేళ్లచెరువు మీదుగా తెలంగాణా రాష్ట్రంలోకి వెళ్లేందుకు ఈ వంతెన కీలకం. లోలెవల్ వంతెన కావటంతో వరద వచ్చినపుడు రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. చుట్టూ తిరగాల్సి రావటంతో సమయం, సొమ్ము వృథా అవుతోంది. నిత్యం అధిక లోడ్‌తో భారీ వాహనాలు తిరుగుతుంటాయి. లోలెవల్ ఉండటం, అధిక భారం పడటంతో వంతెన సామర్థ్యం చాలటం లేదు. దీనికితోడు గత ఏడాది సెప్టెంబరులో పాలేటికి భారీ వరద రావటంతో వంతెన ఆనుకుని రోడ్డు ఎనిమిది అడుగులకు పైగా కోసుకుపోయింది. తాత్కాలికంగా గండిని పూడ్చారు. అయితే పెరిగిన వాహనాల రద్దీని తట్టుకునేందుకు రెండులైన్ల హైలెవల్ వంతెన నిర్మించాలన్న ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. వంతెనకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్ ఇటీవల సీఎం చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేశారు.


అగ్రహారం వంతెన

దొంగ పట్టాలపై కదిలిన డొంక!

మచిలీపట్నం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో సర్వే చేయించి ఇళ్ల స్థలాలు లేని వారిని గుర్తించారు. మచిలీపట్నం నగరంలో 16 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించి 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఉత్తర్వులు జారీ చేశారు. నవశకం పథకంలో భాగంగా అప్పటి మునిసిపల్ కమిషనర్ కాంపిటేటివ్ అథారిటీని ఏర్పాటు చేశారు. ఆర్డీవో స్థాయిలో మచిలీపట్నం నియోజకవర్గంలో 19,200 మందికిపైగా ఇళ్లపట్టాలు ఇవ్వాలని నిర్ణయించారు. భూసేకరణ ప్రత్యేక అధికారిగా ఉన్న కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ మచిలీపట్నం రాగా, ముడా భూములను ఆయనకు అధికారులు చూపారు. ఈ భూములు నివాసానికి పనికిరావని తేల్చారు. దీంతో ప్రైవేటు భూములను సేకరించాలని నిర్ణయించారు. కరగ్రహారం, చిలకలపూడిలోని ప్రైవేటు భూములను పరిశీలించారు. కరగ్రహారంలో ఎకరం రూ.11.50 లక్షల ధర ఉండగా.. చిలకలపూడిలో రూ. 70 లక్షల వరకు ఎకరం భూమి ధర ఉంది. మధ్యేమార్గంగా ఈ రెండు ప్రాంతాల్లోని భూమి ధరను కలెక్టర్ రూ.39 లక్షలుగా నిర్ణయించారు. 320 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఇందులో 60 ఎకరాలకుపైగా భూమికి సరైన పత్రాలు లేకపోవడంతో దీనికి సంబంధించిన నగదును కోర్టులో కట్టారు. సేకరించిన భూమిని ఏ నుంచి ఎల్ బ్లాక్‌లుగా విభజించి చదును చేశారు. ఇందులో అనర్హులకు సెంటు భూమి చొప్పున పట్టాలు ఇచ్చారనే అంశంపై పలు ఫిర్యాదులు అందాయి. దీంతో పాటు మచిలీపట్నం నగరంలో రహదారులు వెంబడి నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్న వారికి ఇంటి పట్టాలు ఇవ్వడానికి పట్టాలు ముద్రించారని, ఇందుకు అప్పట్లో పనిచేసిన జేసీ మాధవీలత ప్రత్యేక లాగిన్ తీసుకుని పట్టాలు ఇచ్చేందుకు అనుమతులు ఇచ్చారని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక నకిలీ పట్టాలపై తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సంతకాలు పెట్టిస్తున్నారని గ్రహించిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొల్లు రవీంద్ర, టీడీపీ, జనసేన నాయకులు రాత్రి 12 గంటల సమయంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో జేసీ గీతాంజలిశర్మ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పట్టాలను స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి దొంగపట్టాల వ్యవహారంపై వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య రాజకీయపరంగా వివాదం నడుస్తోంది. తాజాగా దొంగపట్టాల విషయంలో మాజీ మంత్రి పేర్ని నాని అరెస్ట్ అవుతారనే అంశంపై ఇటీవల కాలంలో ప్రచారం విస్తృతంగా సాగుతోంది. మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి పేర్ని నాని విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి సవాళ్లు ప్రతిసవాళ్లు విసురుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు మంగళవారం రాత్రి ఇంటి పట్టాల పంపిణీ అంశంపై విచారణ ప్రారంభించడంతో ఈ వివాదం ఎన్ని మలుపులు తిరుగుతుందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది,

బండికి సవాళ్లు!

(5వ పేజీ తరువాయి)

నిర్ణయంతో దీని పరిధి నుంచి వెళ్లిపోయాయి. జిల్లాలోని 109 రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులు పండించిన ధాన్యం, అపరాలు ప్రస్తుతం మార్కెటింగ్ చేస్తున్నారు. సివిల్ సప్లయిస్ శాఖకు అనుబంధంగా ఉంటూ జిల్లాలోని రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే రైతు సేవా కేంద్రాలను రైతులకు మెరుగైన సేవలు అందించేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉంది. వ్యాపారవేత్తగా అనుభవం ఉన్న బండి రామకృష్ణ ఈ దిశగా కృష్ణాజిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి జవసత్వాలు తీసుకువస్తారని ఆశిద్దాం.

అంచెలంచెలుగా ఎదిగిన రామకృష్ణ


రామకృష్ణను అభినందిస్తున్న జనసేన నేత గడ్డం రాజు

మచిలీపట్నం టౌన్ : హోటల్ కార్మికునిగా జీవనం ప్రారంభించి ఆర్కే హోటల్స్‌కే యజమాని అయిన బండి రామకృష్ణ మచిలీపట్నం నియోజకవర్గంలో పలు విద్యాసంస్థలతో పాటు హోటళ్లను స్థాపించి ప్రజలకు సుపరిచితుడయ్యారు. పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో 2019లో మచిలీపట్నం నుంచి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి రాజకీయ అరంగేట్రం చేశారు. అనంతరం కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా 2024 ఎన్నికల్లో కొల్లు రవీంద్ర, బాలశౌరి విజయానికి కృషి చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం బండి రామకృష్ణకు డీసీఎంఎస్ అధ్యక్ష పదవిని ఇవ్వడంతో బుధవారం ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సత్య కన్వెన్షన్ హాలులో జరిగే ప్రమాణ స్వీకార మహోత్సవానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మార్కెట్ యార్డు చైర్మన్లు పాల్గొంటారని జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు తెలిపారు.

బినామీలతో పరేషన్!

(5వ పేజీ తరువాయి)

శాతం పెరగటం లేదు.

బినామీ డీలర్లదే హవా!

సివిల్ సప్లయిస్‌లోకి బినామీ డీలర్లు ఎలా ప్రవేశిస్తున్నారో తెలిస్తే ఆశ్చర్యపోతారు. అసలైన డీలర్ల పేర్లు కాగితాల మీదనే కనిపిస్తాయి. పరీక్షలు రాసి, తమ తెలివితేటలతో దక్కించుకున్న వారు ఇప్పటికీ చాలా వరకు షాపులను నిర్వహిస్తున్నారు. ధన ఆశ, అక్రమ వ్యాపారం చేయాలన్న ఉద్దేశ్యం, రాజకీయ సిఫార్సులతో వచ్చిన వారి డిపోలు సింహభాగం బినామీల చేతిలోకి వెళ్లాయి. ఇంకాస్త వివరంగా చెప్పాలంటే అక్రమ బియ్యం వ్యాపారుల స్వాధీనంలో ఉన్నాయి. ఇంత తెలిగ్గా బినామీల చేతుల్లో రేషన్ దుకాణాలు ఎలా నడుస్తున్నాయో చూస్తే ఆశ్చర్యపోతారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి నిత్యావసరాలను డీలర్లు దిగుమతి చేసుకోవాలి. కానీ నామినీల పేరుతో భార్య, ఇతరుల పేర్లను డీలర్లు ఇస్తున్నారు. డీలర్లు సూచించిన నామినీలు ఎవరైనా సరే ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం దిగుమతి చేసుకోవటానికి అవకాశం ఉంటోంది. దీంతో బినామీ డీలర్ల పని సులువైపోతోంది. బినామీ డీలర్లు ఒరిజినల్ డీలర్లుగా వ్యవహరిస్తూ నిత్యావసరాలను డ్రా చేసుకుని తరలించుకుపోతున్నారు. కార్డుదారులకు వీలైనంత వరకు ఇచ్చి .. మిగిలిన వాటిని గుట్టుగా తరలించేస్తున్నారు.

రేబీస్ వ్యాధితో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బర్కత్‌పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రేబీస్ వ్యాధి సోకి చికిత్సల కోసం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి వచ్చిన ఓ వ్యక్తి మృతి చెందాడు. గుడివాడకు చెందిన రాము (36) జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి పార్సిగుట్టలో నివాసం ఉంటున్నాడు. ఆరు నెలల క్రితం గుడివాడకు వెళ్లిన అతను వీధి కుక్క దాడిలో గాయపడ్డాడు. ఆ సమయంలో అతను పూర్తిస్థాయిలో చికిత్సలు తీసుకోలేదు. పైగా మద్యం సేవించాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురైన అతన్ని కుటుంబసభ్యులు సోమవారం ఉదయం ఫీవర్ ఆస్పత్రికి తరలించారు. రేబీస్ లక్షణాలు ఉండడంతో అతడ్ని వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

రైల్వే ఆదాయానికి నష్టం కలిగించిన నేరస్తుల అరెస్టు

రైల్వేస్టేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఆస్తులకు నష్టం చేస్తూ రైళ్లపై రాళ్లు రువ్వడం, పట్టాలపై వివిధ వస్తువులు ఉంచి, ప్రయాణికుల భద్రతకు ముప్పుతెస్తున్న పలువురు నేరస్తులను రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. రాళ్లు రువ్విన కేసుల్లో 102 మందిని ట్రాక్‌లపై వస్తువులను ఉంచినందుకు 33 మందిని అరెస్టు చేశారు. ఈమేరకు 2025 మే మాసాంతం వరకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పనితీరు, ప్రయాణికుల భద్రత పట్ల రైల్వేశాఖ తీసుకుంటున్న చర్యల గురించి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ మంగళవారం ఒక ప్రకటనలో వివరించారు. దక్షిణ మధ్య రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ జోన్ అంతటా అప్రమత్తంగా ఉండి జనవరి నుంచి మే వరకు 128 రాళ్లు రువ్విన కేసులను నమోదు చేసిందన్నారు. వాటిలో 85 కేసుల్లో నిందితులను గుర్తించి 102 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. రైల్వే ట్రాక్‌లపై వివిధ వస్తువులను ఉంచినందుకు 29 కేసులను నమోదు చేశారని, వాటిలో 26 కేసుల్లో 33మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారని, ఈ కేసులన్నీ కూడా విచారణలో ఉన్నాయన్నారు. రైళ్లపై రాళ్లు రువ్వేవారిని, ట్రాక్‌లపై వస్తువులు పెట్టేవారిని గుర్తించినట్లయితే 139కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

సాగుకు సన్నద్ధం!

(5వ పేజీ తరువాయి)

పోయడంతో పాటు, వెదజల్లే పద్ధతిలో సాగు చేపట్టారు. ఈ ఏడాది ఎంటీయూ 1061, 1318, 1224, 1262, బీపీటీ-5204, స్వర్ణ తదితర రకాల వరి వంగడాలతో పాటు ఎంటీయూ 2077, 5293, పీఎల్‌ఏ 1100 (బాలామసూరి)వంటి పాతరకాల వరి వంగడాలను రైతులు సాగుచేసే యోచనలో ఉన్నారు. ఇప్పటికే 550 ఎకరాలకుపైగా నారుమడులు పోశారు. ఈ ఏడాది మేలో భారీ వర్షాలు కురవడంతో పూర్తిస్థాయిలో నేల ఆరలేదని, దీంతో వరి పైరుకు తెగుళ్లబెడద అధికంగా ఉండే ప్రమాదం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. నేల పూర్తిస్థాయిలో ఆరితే వేసవి దుక్కుల తర్వాత నేలగుల్ల బారేదని, ఈ ఏడాది ఈ స్థితి లేకుండా పోయిందని అంటున్నారు.

వాతావరణం అనుకూలించేనా!

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. రుతుపవనాలు వచ్చినట్లే వచ్చి ముఖం చాటేశాయి. వాతావరణం వ్యవసాయానికి అనుకూలంగా మారలేదు. దీంతో శివారు ప్రాంత రైతులు నారుమడులు పోసేందుకు, వెదజల్లే పద్ధతిన సాగు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఈ నెలాఖరు నాటికి వాతావరణం అనుకూలంగా మారితే ఇప్పటికే నారు మడులు పోసిన ప్రాంతాల్లో జూలై మొదటి వారంలో వరి నాట్లు ప్రారంభమవుతాయని, కాలువ శివారు ప్రాంతాల్లో ఈ నెలాఖరునాటికి నారుమడులు పోయడం ప్రారంభమవుతుందని రైతులు అంటున్నారు.

సమస్యలతో సహజీవనం

(5వ పేజీ తరువాయి)

సతమతం అవుతున్నారు.

కన్నెత్తిచూడని రెండు జిల్లాల అధికారులు

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చే నాటికి జిల్లాల విభజన జరగలేదు. తర్వాత ఉమ్మడి కృష్ణా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలుగా ఏర్పడింది. అయితే ప్రస్తుతం విజయవాడ తూర్పు నియోజకవర్గ ప్రజలు ఎన్టీఆర్ జిల్లా వాసులుగా రికార్డులో ఉండగా, వారికి కృష్ణాజిల్లా వణుకూరులో ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు ఉంది. దీంతో రెండు జిల్లాల అధికారులు ఈ ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతకాలం హౌసింగ్ అధికారుల పర్యవేక్షణలో ఈ లేఅవుట్ ఉండగా, ఇప్పుడు వారు కూడా ముఖం చాటేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ లేఅవుట్‌ను వీఎంసీ అధికారులు తమకు అధికారికంగా అప్పగించలేదని వణుకూరు పంచాయతీ అధికారులు తప్పించుకుంటున్నారు. వీఎంసీ కమిషనర్‌గా ధ్యానచంద్ర బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు లే అవుట్ వైపు కన్నెత్తి చూడలేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రెండు జిల్లాల కలెక్టర్లు ఇప్పటి వరకు రాలేదని ఆరోపణ కూడా ఉంది.

నీరు లేక కన్నీళ్లు

కాలనీలో నీటి వసతి కోసం పైపులైన్లు, ట్యాంకులు ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సొంతంగా బోరు వేసుకుంటేనే నీరు. వాతావరణం అనుకూలించక విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఇక అంతే సంగతి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఒకరోజంతా కరెంటు లేకపోవడంతో స్థానికులు నానా అవస్థలు పడ్డారు.

మట్టి రోడ్లే దిక్కు

కాలనీలో ప్రధాన రహదారితో పాటు వీధుల్లో మట్టి రోడ్లు వేశారు. ప్రస్తుతం ఈ రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వర్షాకాలం బురదతో నిండిపోయి అడుగుతీసి అడుగు వేయడానికి స్థానికులు భయపడుతున్నారు. దీనికి తోడు కాలనీలో భారీ వాహనాలు వెళ్తుండటంతో రోడ్లు గోతులమయం అయ్యాయి. చినుకు పడితే వాహనాలు జారిపోయేలా ఉన్నాయి. మద్దూరు- గోసాల ప్రధాన రోడ్డు రాళ్లు తేలి అధ్వానంగా తయారైంది.

కరెంట్ కష్టాలు

లే అవుట్‌లో వీధి దీపాలు అక్కడక్కడ కనిపిస్తాయి. వాటిలో ఎన్ని వెలుగుతాయో చెప్పలేని పరిస్థితి. పాముల సంచారం ఎక్కువగా ఉండటంతో రాత్రి వేళల్లో బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. కాలనీలో కొన్ని చోట్ల కరెంటు లైన్లు ఉన్నా వాటికి విద్యుత్ సరఫరా ఇవ్వలేదు.

ఎక్కడి మురుగు అక్కడే..

కాలనీ రోడ్లు, డ్రెయిన్లు లేకపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. రోజుల తరబడి నిల్వ ఉండటంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. దోమలకు ఆవాసంగా మారుతోంది. వీటికి తోడు పిచ్చి మొక్కలతో ఆ ప్రాంతం అడవిని తలపిస్తోంది.

బస్సు కోసం పరుగులు

మద్దూరు వరకు 121 ఎం బస్ సర్వీస్ నడుస్తోంది. ఈ కాలనీ వాసులకు ఈ బస్సే ఆధారం. ప్రయాణికులు ఉన్నచోట బస్సు ఆపకుండా ఎక్కడో ఆపుతున్నారని, అక్కడకు పరుగులు తీయాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక చోట స్థిరమైన ప్రదేశంలో బస్సు ఆపేలా, అక్కడ బెంచీలు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గంజాయి బ్యాచ్ సంచారం

వణుకూరు, మద్దూరు మధ్య పోలీస్ బీట్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వణుకూరు దాటితే నిర్మానుష్యంగా ఉంటుంది. ఖాళీ ప్రదేశం, వీధి దీపాలు లేకపోవడంతో గంజాయి బ్యాచ్‌లు, మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు ఇటువైపు తిరుగుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో విధులు నిర్వహించుకుని వచ్చే వారికి వీరి వల్ల ఇబ్బందులు వస్తున్నాయని చెబుతున్నారు.

హౌస్ హోల్ మ్యాపింగ్ కూడా లేదు

ఈ కాలనీలో నివసిస్తున్న వారంతా తూర్పు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారే. ఇక్కడ ఉన్న వారందరికీ విజయవాడలోని సచివాలయాల్లో మ్యాపింగ్ అయినట్లు చెబుతున్నారు. ఇక్కడికి వచ్చిన తర్వాత వణుకూరు సచివాలయంలో మ్యాపింగ్ చేయించుకోవాలని అధికారులు చెప్పగా, అక్కడకు వెళితే ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. రెండు జిల్లాల అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్ 102, 110, 121
చికెన్ విత్ స్కిన్ 194
చికెన్ స్కిన్‌లెస్ 204



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

చంద్రబాబు, లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం

గుడివాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఎంత మంది ఉంటే అంతమందికి తల్లికి వందనం నగదును అందజేసిందని 15వ వార్డు టీడీపీ నాయకులు కంచర్ల సురేష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక 15వవార్డు, గుడ్‌మెన్‌పేటలో ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంగిపురపు సంధ్యారాణి, అద్దంకి మాణిక్యాలరావు, జుత్తుక రత్నకుమార్,రాచపూడి శాంతారావు, శామ్యూల్ పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ప్రజలు

గుడివాడ అభివృద్ధే లక్ష్యం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు కలిసికట్టుగా గుడివాడ అభివృద్ధికి పనిచేద్దామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పురపాలక సంఘం సమావేశ మందిరంలో ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యంతో కలిసి వివిధ శాఖల అధికారులతో పబ్లిక్-ప్రైవేటు-పీపుల్స్ పార్టనర్‌షిప్(పీ4), ఫ్యామిలీ ఎంపవర్‌మెంట్, బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థితిలో న్న 10శాతం మంది, అట్టడుగున ఉన్న 20శాతం మంది పేదలను దత్తత తీసుకోవాలన్నారు. వారికి అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందించి పేదరిక నిర్మూలనకు కృషిచేయాలలన్నారు. పీ4 విధానం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హత ఉన్న కుటుంబాలను గ్రామ, వార్డు సచివాయాల వద్ద సమాచారం, హౌస్ హోల్డ్ సర్వే, గ్రామసభల ధ్రువీకరణ ద్వారా గుర్తించాలని సూచించారు. నియోజకవర్గంలో యువతకు ఉద్యోగాల కల్పన, పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను గుర్తించాలని సూచించారు. పీ4 పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించిన గుడ్లవల్లేరు మండలం కుచ్చికాయలపూడి గ్రామంలో ఇటీవల నిర్వహించిన సర్వే వివరాలను ఎమ్మెల్యేకు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్లు లోకరాజు, కిరణ్, ఎంపీడీవోలు విష్ణుప్రసాద్, సారథి, నాగమల్లేశ్వరీ, మున్సిపల్ ఎంఈ ప్రసాద్, డీఈలు వరప్రసాద్, సతీష్ చంద్ర, నియోజకవర్గ ప్రత్యేక అధికారి నరసింహులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : అర్హత ఉండి, ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం అమలు చేస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో జగన్ బటన్ నొక్కుడు పేరుతో భారీ బహిరంగ సభలు, సాక్షి పత్రికల్లో ప్రకటన పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు నూకాలమ్మ, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, కూటమి నాయకులు రాంబాబు, మురళీ, దానేటి సన్యాసిరావు, లింగం ప్రసాద్, సందు పవన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



ఇంచార్జ్ తహసీల్దార్ కిరణ్‌ను సన్మానిస్తున్న వీఆర్వోలు, సిబ్బంది

గుడివాడ ఇంచార్జ్ తహసీల్దార్‌గా కిరణ్

గుడివాడ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గుడివాడ ఇంచార్జ్ తహసీల్దార్‌గా కిరణ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గుడివాడ తహసీల్దార్‌గా పని చేస్తున్న వాసిరెడ్డి రామకోటేశ్వరరావు శనివారం బదిలీపై వేరే మండలం వెళ్లగా, డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న కిరణ్‌ని ఇంచార్జ్ తహసీల్దార్‌గా నియమించారు. వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

విద్యుత్‌కు అంతరాయం

పమిడిముక్కల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ట్రాన్స్‌కో 220 కేవీ నున్న-గుడివాడ ట్రాన్స్‌మిషన్ లైన్ ఆధునీకరణలో సాంకేతిక మరమ్మతుల కారణంగా ఈ నెల 30వరకు పనులు చేయనున్న పరిస్థితుల్లో గుడివాడ 220కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో ఒక సర్క్యూట్ విద్యుత్ సరఫరాని తాత్కాలికంగా నిలిపివేయనున్నామని మండల ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. రోజూ ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల మధ్యలో మండల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. అత్యవసర పరిస్థితి ఉత్పన్నమైతే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.



విద్యార్థులకు నోటుపుస్తకాలను అందజేస్తున్న యాదవ సేవాసంఘం సభ్యులు

నోటు పుస్తకాల పంపిణీ

గుడివాడ: స్థానిక కేటీఆర్ కళాశాల రోడ్డు లోని శిరీష రిహాబిలిటేషన్ సెంటర్‌లోని విద్యార్థులకు గుడివాడ ట్రాఫిక్ ఏఎస్సై వి.భాగ్యవతి వితరణతో శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో మంగళవారం నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.హరికుమార్, బీఎస్ఎన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాస్, సేవా సంఘం సభ్యులు, శిరీష రిహాబిలిటేషన్ సెంటర్ నిర్వాహకులు మధులత పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

గుడివాడ : నిబంధనలకు విరుద్ధంగా అక్రమమార్గాల్లో పుస్తకాలను విక్రయిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సుందరయ్యభవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుస్తకాల పేరుతో లక్షలాది రూపాయలు పోగుచేసుకుంటున్నారని, వెంటనే గుడివాడ శ్రీచైతన్య క్యాంపస్‌పై చర్యలు తీసుకోవాలపి డిమాండ్ చేశారు. దీంతోపాటు గుర్తింపును రద్దు చేసి, పాఠ్యపుస్తకాలను సీజ్ చేయాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు తొత్తులుగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు,ఇంటర్ బోర్డు అధికారులపై చర్యలు తీసుకోవాలని సమరం డిమాండ్ చేశారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

పెదపారుపూడి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి (చంటి), మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు ఒక ప్రకటనలో మంగళవారం తెలియజేశారు. పామర్రులోని విజయవాడ రోడ్డులో గల ఆరేపల్లి కల్యాణ మండపంలో ఈ నెల 18వ తేదీ ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆధ్వర్యంలో నిర్వహించనున్నామన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులై - పీజీ వరకు చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు పూర్తి సమాచారంతో హాజరై బయోడేటాను నమోదు చేయించుకోవాలని కోరారు. 10 రకాల లిమిటెడ్ సంస్థలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటాయని తెలిపారు.

తల్లికి వందనంకు కుల ధ్రువీకరణ పత్రం అవసరం లేదు : కమిషనర్

గుడివాడ : తల్లికి వందనం పథకంలో సమస్యలుంటే గ్రీవెన్స్ ద్వారా అయా సచివాలయాల్లో సరిచేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హుల జాబితాలో పేర్లు లేకుంటే సచివాలయాల్లో వెల్ఫేర్ కార్యదర్శులను సంప్రదించాలని, వారిచ్చిన దరఖాస్తును పూర్తి చేసి దానిలో పేర్కొన్న తొమ్మిది అంశాలంకు పూర్తిస్థాయి సమాచారం ఇస్తే సరిపోతుందన్నారు. ఎటువంటి కులధృవీకరణ పత్రాలు అవసరం లేదని కమిషనర్ మనోహర్ స్పష్టం చేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

● వ్యవసాయ అధికారి ఎస్.గణేశ్‌రెడ్డి

పమిడిముక్కల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : వరినారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని, తద్వారా అధిక దిగుబడులు సాధించొచ్చని మండల వ్యవసాయ అధికారి ఎస్.గణేశ్‌రెడ్డి అన్నారు. మద్రివాడ, తాడంకి గ్రామాల్లో మంగళవారం వరి నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నారుమడుల పెంపకంపై రైతులకు పలు సూచనలు , పాటించ వలసిన యాజమాన్య పద్ధతులు సవివరంగా తెలియజేశారు. అన్నదాతా సుఖీభవ పథకం ఈకేవైసీకి సంబంధించి ప్రభుత్వం ఇతర పథకాల ఈకేవైసీని అనుసంధానించడం వల్ల ఈకేవైసీ రైతుల సంఖ్య తగ్గిందన్నారు. 190మంది రైతులు మాత్రమే ఈకేవైసీ చేయాల్సి ఉందన్నారు. సీసీఆర్సీ కౌలు గుర్తింపు కార్డులు కావలసిన రైతులు గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు. పశువైద్యుడు రామ్‌నరేశ్, వ్యవసాయ సహాయకులు కొడాలి రుక్మిణి, జి.కావ్యారెడ్డి పాల్గొన్నారు.



వరినాడుమడులను పరిశీలిస్తున్న ఎస్.గణేశ్‌రెడ్డి

మొవ్వలో అద్దె చెల్లించని దుకాణాల సీజ్

కూచిపూడి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మొవ్వ శాఖ గ్రంథాలయ పరిధిలోని రెండు దుకాణాలను అద్దె చెల్లించని కారణంగా తహసీల్దార్ కె.మస్తాన్ ఆధ్వర్యంలో గ్రంథాలయాధికారులు మంగళవారం దుకాణాలను స్వాధీనం చేసుకున్నారు. మల్లంపల్లికి చెందిన డొక్కు నాగజ్యోతి మూడేళ్ల క్రితం గ్రంథాలయ పరిధిలోని 3, 4 దుకాణాలను అద్దెకు తీసుకుని బట్టల దుకాణంతోపాటు ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా దుకాణాలు తెరవకుండా అద్దె కూడా చెల్లించక పోవటంతో గ్రంథాలయాధికారిణి కృష్ణకుమారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రెండు దుకాణాలకు కలపి గత డిసెంబర్ నెల నుంచి రూ.15300ల చొప్పున అద్దె బకాయి ఉంది. దీంతో ఆమెకు నోటీసులు జారీ చేసినా స్పందన కొరవడటంతో అధికారుల సమక్షంలో తాళాలు పగులకొట్టి షాపులో మెటీరియల్‌ను పెద్దల సమక్షంలో లెక్క కట్టి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం దుకాణాలను సీజ్ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్, డిప్యూటీ లైబ్రేరియన్ నగేష్, జూనియర్ అసిస్టెంట్ రామారావు, గ్రామసర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు మండవ కోటేశ్వరరావు, వీఆర్వో నాగమల్లేశ్వరి, గ్రంథాలయ అధికారిణి టి.కృష్ణకుమారి పాల్గొన్నారు.



అధికారుల సమక్షంలో షాపు తాళాలు పగులకొడుతున్న సిబ్బంది

సీపీఎం సీనియర్ నేత కూరపాటి మృతి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామయ్య

కూచిపూడి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వేములమడకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు కూరపాటి కృష్ణమూర్తి (85) అనారోగ్య కారణాల రీత్యా మంగళవారం ఆయన స్వగృహంలో మృతి చెందారు. దశాబ్దాల కాలం నుంచి సీపీఎంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పార్టీ నిర్వహించిన అనేక ఉద్యమాల్లో పేదల పక్షాన ఆయన పోరాటాలు చేశారు. నిడుమోలు మాజీ శాసనసభ్యులు పాటూరి రామయ్య, పార్టీ నేతలు వాకా రామచంద్రరావు, శీలం నారాయణరావు, మద్దుల బసవయ్య, తాతా నారాయణరావు, మురహరిరెడ్డి, పార్టీలకతీతంగా నేతలు పాల్గొని కూరపాటి కృష్ణమూర్తికి నివాళులర్పించారు.

సాగుకు సిద్ధం

పెడనరూరల్ : ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. కాలువలకు నీరు విడుదల కావటంతో దుక్కి పనులు చేస్తున్నారు. అడపా దడపా వర్షాలు కురుస్తుండటంతో విత్తనాలు వెదజల్లే ఆలోచనలో రైతులు ఉన్నారు. ఈ ప్రక్రియతో సాగు ఖర్చులు తగ్గించకోవాలని రైతులు భావిస్తున్నారు.

రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి

● కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త డి.నవీన్



వలివర్తిపాడులో రైతులకు సూచనలిస్తున్న కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త డి.నవీన్

గుడివాడ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి నారుమడులు పోసే ముందు విత్తనశుద్ధి చేసుకోవాలని కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త డి.నవీన్ అన్నారు. లింగవరం, వలివర్తిపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శాస్త్రవేత్త మాట్లాడుతూ రైతులు విత్తనశుద్ధి చేసుకోవటం వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. విత్తనశుద్ధి అనంతరం వరి మొలక శాతం లెక్కించటానికి 100 వరి విత్తనాలను తీసుకుని మొలకకు ఒక ప్రదేశంలో పోయాలని, వాటిలో 80 శాతం మొలకలు వస్తే నాణ్యమైన విత్తనాలుగా గుర్తించాలని తెలిపారు. ప్రతి రైతూ విత్తనశుద్ధి చేసుకోవటం వల్ల చక్కటి వరి నాట్లు వేసుకోవటానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. రైతులు వరి నారుమడులలోని తక్కువ మోతాదులో చీడపీడలు నివారణకు మందులను తక్కువ మోతాదులో పిచికారి చేసుకోవాలన్నారు. ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్పిన సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందేందుకు కృషి చేయాలన్నారు. శాస్త్రవేత్తల అనుభవాలు, సూచనలు రైతులు పాటించాలని ఆమె కోరారు. ప్రతి రైతూ సేంద్రీయ వ్యవసాయానికి మొగ్గుచూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మి, పశుసంవర్ధకశాఖ అధికారి అభిషేక్, వలివర్తిపాడు రైతు రజనీకాంత్, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కూచిపూడి : మొవ్వ మండలం అయ్యంకిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి సురేష్ నాయక్ నారుమడులు, వెదపద్ధతిన సాగులో కలుపు యాజమాన్యం, భూమికి అనువైన వరి వంగడాల ఎంపిక, విత్తనశుద్ధి, పంట పొలాల్లో పైరుకు అవసరమైన రసాయనాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రాజులపాటి పార్వతీ, వీఏఏ రాజేష్, రైతులు పాల్గొన్నారు.



అయ్యంకిలో రైతులతో మాట్లాడుతున్న సురేష్ నాయక్

ఫొటో, వీడియోగ్రాఫర్ల ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్లుగా ఫొటోగ్రాఫర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వం ఫొటో, వీడియోగ్రాఫర్లను ఆదుకోవాలని రాష్ట్ర ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాదాల రమేష్ అన్నారు. మంగళవారం ఈడేపల్లిలోని మచిలీపట్నం డివిజన్ ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో మాదాల రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఫొటో, వీడియోగ్రాఫర్ల ఫెడరేషన్ ఏర్పాటు చేసి ఫొటోగ్రాఫర్ల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. కెమెరాలు, స్టూడియోలు ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకుల ద్వారా స్వల్ప వడ్డీకి రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం డివిజన్ ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలంకుర్తి శేషు, కార్యదర్శి వి.అనంతకుమార్, కోశాధికారి మట్టా శ్రీరామ్, లంకిశెట్టి బాలాజీ తదితరులు మాట్లాడారు. ఆధునిక ఫొటో టెక్నాలజీపై భూపాల్‌కుమార్ వివరించారు.

ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం దారుణం

● సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సీపీఎం నేత మురళీకృష్ణ

గుడివాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది వ్యవధిలో విద్యుత్ భారాల పేరుతో రూ.15వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వరరావు ఆరోపించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లల ఏర్పాటును వ్యతిరేకిస్తూ పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సుందరయ్యభవన్ నుంచి ప్రారంభమైన ర్యాలీని సీనియర్ నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనకన్న మిన్నగా పాలన అందిస్తామని బీరాలు పలికిన కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. గత ప్రభుత్వ కాలంలో టీడీపీ నాయకులు నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్‌మీటర్‌ల ఏర్పాటుచేస్తే ధ్వంసం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారని గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లను బిగించడానికి సిద్ధమవడం బాధాకరమన్నారు. నాయకులు శీలం నారాయణరావు, శివనాగేంద్ర, వెంకటేశ్వరరావు, రక్షణస్వామి, ఆర్‌సీపీ రెడ్డి, బొర్రా సుబ్రహ్మణ్యం, బేత శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : తమ ఇళ్లకు విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని మేదర బ్యాంబు వర్కర్స్ కొమరగుండం మహిళలు తేల్చి చెప్పారు. మంగళవారం స్థానిక మేదరబజారులో చిన్నదుకాణాదారులు, ఫౌండ్రీల యజమానులు, కొమరగుండం మహిళలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్ర చిత్రీ వర్క్స్ యజమాని నాగరాజు మాట్లాడుతూ తాము వద్దంటున్న బలవంతంగా స్మార్ట్‌మీటర్‌లను బిగించారని, వాటిని తీసేసేవరకు పోరాడతామని హెచ్చరించారు. స్మార్ట్‌మీటర్‌ల బిగింపునకు నిరసనగా జూలై 9వ తేదీన జరుగు పట్టణ బంద్‌కు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిల్లి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, డి.సురేష్ బాబు, కర్రె వెంకటేష్, పి.సుబ్బారావు, సాకిలి, కృష్ణ, కొమరగుండం మహిళలు బాలమ్మ, లక్ష్మీ,జ్యోతి, రజాక్, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మేదరబజారు, కోమరగుండం మహిళలు

గుడివాడ : స్థానిక ధనియాలపేటలో గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ప్రయత్నం చేస్తున్న అదానీ ఏజెంట్‌లను మంగళవారం స్థానికులతో కలిసి సీపీఎం నాయకులు అడ్డుకున్నారు. స్థానికులు ప్రతిఘటించడంతో బిగించేందుకు వచ్చిన వారు చల్లగా జారుకున్నారు. తమ కాలనీలో స్మార్ట్‌మీటర్‌లను ఏర్పాటు చేస్తే ఊరుకోబోమని, వాటిని పగలకొడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్‌మీటర్లు బిగించేందుకు వచ్చిన వారిని వారిస్తున్న ధనియలపేట వాసులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	102, 110, 121
చికెన్ విత్ స్కిన్	194
చికెన్ స్కిన్‌లెస్	204



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

కోర్టు బిల్డింగ్ ప్రారంభం

బంటుమిల్లి (కృత్తివెన్ను), జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి జూనియర్ సివిల్ కోర్టులో హాఫ్ బిల్డింగ్, కోర్టు హాలును మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి ప్రారంభించారు. మిగిలిన హాఫ్ కోర్టు బిల్డింగ్ పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు, కాంట్రాక్టర్‌కు తగిన సలహాలు, సూచనలు చేశారు. జూనియర్ సివిల్ జడ్జి భాస్కరరావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్యాంబాబు, సెక్రటరీ నాగాంజనేయులు, బంటుమిల్లి ఎస్సై గణేష్, ఎక్సైజ్ సీఐ రమణ తదితరులు పాల్గొన్నారు.



కోర్టుహాలును ప్రారంభిస్తున్న న్యాయాధికారి గోపి

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ

చల్లపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ అన్నారు. చల్లపల్లి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చల్లపల్లి, వక్కలగడ్డ రైతుసేవాకేంద్రాల వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ కార్యక్రమాన్ని ప్రారంభించి చల్లపల్లి సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికే రైతులకు పచ్చిరొట్ట, వరి విత్తనాలు సరఫరా చేయగా, ఎరువులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు రైతులు పాటించి మంచి దిగుబడులు సాధించాలన్నారు. చల్లపల్లి ఏవో కె.మురళీకృష్ణ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు, రాయితీలను వివరించారు. ఘంటసాల శాస్త్రవేత్త డాక్టర్ లహరి, పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ వెంకటరెడ్డిలు ప్రసంగించారు. కార్యక్రమంలో సర్పంచ్ వల్లూరు ఉమా, ఏఎంసీ సూపర్‌వైజర్ బి.తులసీదాస్, సొసైటీ సీఈవో తోట కృష్ణారావు,లు, వీఏఏ సౌజన్య, రైతులు పాల్గొన్నారు.

ఘంటసాల: ఖరీఫ్ సీజన్ ప్రారంభం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం, అచ్చెంపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏడీఏ ఎస్.శ్యామల మాట్లాడుతూ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతీ మంగళ, బుధ వారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రెండు గ్రామాల్లోని పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు ముప్పనేని రవి ప్రసాద్, గాజుల నాగ శ్రీనివాసరావు, శ్రీకాకుళం డీసీ వైస్ చైర్మన్ సుగ్గన రాంబాబు, కెవికె శాస్త్రవేత్త వెంకటలక్ష్మి, మండల వ్యవసాయాధికారిణి ఉషారాణి, ఏఎంసీ వైస్ చైర్మన్ అత్తులూరి గోపీచంద్, వీఆర్వో గోపి, కూటమి నేతలు సుగ్గన పవన్ కుమార్, కోటి, పాల్గొన్నారు.

మోపిదేవి: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఏవో హెప్సిబారాణి తెలిపారు. మంగళవారం ఉదయం మండలంలోని వెంకటాపురం రైతుసేవా కేంద్రం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం రాయితీపై 1061 వరి విత్తనాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ రావి దుర్గావాణి, పలువురు రైతులు, ఆర్ఎస్‌కె సహాయక సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీకాకుళంలో పంట పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు



చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నేతలు

మాటనిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

పెడన, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకాన్ని విజయవంతంగా అమలు చేసి కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య అన్నారు. కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేసినందుకు గాను నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక 14వ వార్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌ల చిత్రపటాలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు కోరుమిల్లి వెంకటస్వామి, వేములమడ జనార్దన్, అవనిగడ్డ వెంకటేశ్వరరావు, కందుకూరి పైడేశ్వరరావు, కొమ్మాలపాటి నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు అనుముల పూర్ణచంద్రరావు, పరా సూర్యనారాయణ, ఎలిగట్ల ప్రసాద్, మెట్ల సుబ్రహ్మణ్యం, బీజేపీ నాయకులు మామిడి లక్ష్మీనారాయణ గుప్తా, కొల్లూరి రాధాకృష్ణగుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్లుగా ఫొటోగ్రాఫర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వం ఫొటో, వీడియోగ్రాఫర్లను ఆదుకోవాలని రాష్ట్ర ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాదాల రమేష్ అన్నారు. మంగళవారం ఈడేపల్లిలోని మచిలీపట్నం డివిజన్ ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో మాదాల రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఫొటో, వీడియోగ్రాఫర్ల ఫెడరేషన్ ఏర్పాటు చేసి ఫొటోగ్రాఫర్ల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. కెమెరాలు, స్టూడియోలు ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకుల ద్వారా స్వల్ప వడ్డీకి రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం డివిజన్ ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలంకుర్తి శేషు, కార్యదర్శి వి.అనంతకుమార్, కోశాధికారి మట్టా శ్రీరామ్, లంకిశెట్టి బాలాజీ తదితరులు మాట్లాడారు. ఆధునిక ఫొటో టెక్నాలజీపై భూపాల్‌కుమార్ వివరించారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

అవనిగడ్డ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో పీఎం సూర్యఘర్ కరపత్రాన్ని విద్యుత్‌శాఖ అధికారులు ఆవిష్కరింపచేశారు. సబ్ డివిజన్ పరిధిలో వంద ఇళ్లకు సోలార్ విద్యుత్ లక్ష్యం సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే చేతులమీదుగా కేక్ కట్ చేయించి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ ఎన్.సుబ్రహ్మణ్యేశ్వరరావు ఏఈ ఎస్‌వివి.సత్యనారాయణ, పాల్గొన్నారు.

ఫణికుమార్ కుటుంబ సభ్యులకు టీడీపీ పరామర్శ

ఘంటసాల : శ్రీకాకుళం గ్రామానికి చెందిన ఆత్మూరి ఫణికుమార్ ప్రమాదవశాత్తు మృతి చెందగా, మంగళవారం టీడీపీ నేతలు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఫణికుమార్ తండ్రి ధర్మారావును పరామర్శించిన నేతలు ధైర్యంగా ఉండాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ మృతుని కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఫణికుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాసరావు, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, టీడీపీ నేతలు చౌదరిబాబు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మస్తర్లు వేయకుండానే వేతనాల చెల్లింపు

● పెదకళ్లేపల్లి గ్రామసభలో తనిఖీ బృందం వెల్లడి

మోపిదేవి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 17వ విడత చేపట్టిన సామాజిక తనిఖీ ప్రక్రియలో పెదకళ్లేపల్లిలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసర్పంచ్ అరజా సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో తనిఖీ బృందం డీఆర్పీ ధనుంజయ వివరాలను వెల్లడించారు. 2024-25 సంవత్సరానికి గానూ 110 పనులకు సంబంధించి రూ.1,29,08,883లు లెక్కించటం జరిగిందన్నారు. ఇందుకు గానూ గ్రామంలో కొన్ని గ్రూపులకు మాత్రమే పనులు చూపిస్తూ కొంతమందికి పనులు కల్పించటం లేదని ప్రజలు గ్రామసభలో తీసుకొచ్చారు. ఒక గ్రూపుకు సంబంధించి శ్రామికులు పని కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఇప్పటి వరకు పనులు కల్పించలేదని, నిరుద్యోగ భృతి చెల్లించలేదని డీఆర్పీ వెల్లడి చేశారు. గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో భాగంగా చేసిన పనులకు ఎం.బుక్ రికార్డు లేకుండా రూ.3.66 లక్షలు చెల్లించటం, మస్తర్లు లేకుండానే కూలీలకు వేతనాలు చెల్లిస్తున్నట్లు తనిఖీలో గుర్తించినట్లు తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. అనంతరం ఎస్ఆర్‌పీ సూర్యచక్రమాట్లాడుతూ, గ్రామీణ ఉపాధి హామీ పథకం అవినీతి రహితంగా నిర్వహించేందుకు శ్రామికులు, గ్రామస్థులు బాధ్యత తీసుకోవాలన్నారు. చేస్తున్న పనిని పర్యవేక్షించి సక్రమంగా నిర్వహించేలా గ్రామస్థులు, రైతులు పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. వైస్ ఎంపీపీ సీతారామాంజనేయులు, ఎంపీటీసీ అరజా ఆషాదేవి, ఏపీవోలు ముత్యాలు, రవికుమార్ పాల్గొన్నారు.



గ్రామసభలో నివేదిక వెల్లడిస్తున్న డీఆర్పీ ధనుంజయ

సమష్టిగా యోగాంధ్రను విజయవంతం చేయండి

● ఆర్డీవో కె.స్వాతి

మోపిదేవి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19న మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం ఆవరణలో నిర్వహించనున్న యోగా కార్యక్రమాన్ని వివిధ శాఖల ఉద్యోగులంతా సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలని మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి అన్నారు. మంగళవారం సాయంత్రం మోపిదేవి విచ్చేసిన ఆమె వివిధ శాఖల ఉద్యోగులతో యోగా కార్యక్రమాల ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటున్న యోగా కార్యక్రమానికి అన్నివర్గాల ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసేలా కృషి చేయాలన్నారు. యోగా కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ప్రజలు, ఇతరులు క్రమశిక్షణతో ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైన ఉందన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ప్రజలకు, యోగాలో పాల్గొనేందుకు వచ్చిన వారికి ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా అల్పాహారం, ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రావి దుర్గావాణి, తహసీల్దార్ శ్రీవిద్య, ఎస్ఐ వైవి.సత్యనారాయణ, ఎంఈవో పిచ్చియ్య, దేవస్థానం పర్యవేక్షకులు మధుసూదనరావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గోపాల్, జయంతి, రమణ, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



క్రీడామైదానంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో స్వాతి

అంతర్వేది మృతులకు నివాళులర్పించిన మండలి వెంకట్రామ్



పోతురాజు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న వెంకట్రామ్

నాగాయలంక, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అంతర్వేదిలో పడవ బోల్తా పడిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన నాగాయలంక మత్స్యకారుల భౌతికకాయాలు మంగళవారం వారి స్వగృహాలకు చేరుకున్నాయి. జనసేన నాయకులు మండలి వెంకట్రామ్ గుల్లలమోదలో నాగిడి రాము (25) భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఇదే ప్రమాదంలో గాయపడిన నాయుడు వెంకటేశ్వరరావును పరామర్శించారు. అనంతరం సంగమేశ్వరం గ్రామంలో తమ్ము పోతురాజు(65) భౌతికకాయాన్ని సందర్శించి నివాలులర్పించారు. ఘటనలోని మృతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

మృతుల కుటుంబాలకు చిలకలపూడి, కనపర్తి పరామర్శ

కోనసీమ జిల్లా అంతర్వేదిలో సోమవారం జరిగిన చేపల బోటు ప్రమాదంలో మండల పరిధిలోని సంగమేశ్వరంకి చెందిన తమ్ము పోతురాజు, గుల్లలమోదకు చెందిన నాగిడి రాము సముద్రంలో పడి మృతి చెందగా, మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అగ్నికుల క్షత్రియుల కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు భౌతికకాయాలను సందర్శించి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన బీమా పరిహారం త్వరితగతిన అందేలా కృషి చేస్తామన్నారు. గుల్లలమోదకు చెందిన వెంకటేశ్వరరావుకు ఈప్రమాదంలో ఎడమ కాలు విరిగింది. మృతుల కుటుంబాలకు అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌పాపారావు వ్యక్తిగతంగా రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయమందించారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మెండు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులకు వివాహిత ఆత్మహత్య

మచిలీపట్నం టౌన్, జూన్17 (ఆంధ్రజ్యోతి) : వరకట్నపు వేధింపులకు వివాహిత వడ్లమూడి లక్ష్మి (19) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రూరల్ పోలీసులు అందించిన వివరాల మేరకు.. బందరు మండలం పోతేపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీతో వలందపాలెంకు చెందిన సతీష్‌కు ఏడాది క్రితం వివాహమైంది. వివాహ సమయంలో 70 వేలు కట్నం ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. 40 వేలు ఇచ్చారు. మిగిలిన 30 వేలు బాకీ పడ్డారు. లక్ష్మికి చిన్నప్పుడే తల్లిదండ్రులు మృతి చెందారు. అన్న వడ్లమూడి వెంకటేశ్వరరావు ఈమెను పెంచుతున్నాడు. ఈ నేపథ్యంలో కట్నం పూర్తిగా ఇవ్వలేదని భర్త సతీష్, బావ పవన్, అత్త వెంకటేశ్వరమ్మలు వేధిస్తున్నారు. ఈ వేధింపులకు తట్టుకోలేక ఆరునెలల క్రితం లక్ష్మి పోతేపల్లిలోని పుట్టింటికి వచ్చేసింది. వేధింపుల సమస్యను దిశ పోలీసుల వరకు తీసుకువెళ్లారు. భార్యా భర్తలకు కౌన్సెలింగ్ చేశారు. అయినా సర్దుబాటు కాలేదు. వలందపాలెంలో తల్లిదండ్రులతో కాకుండా వేరే కాపురం పెడదామని భర్త సతీష్, లక్ష్మి అనుకున్నారు. ఇందుకు కావాల్సిన సొమ్ములు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. దిశ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఒప్పందం ప్రకారం బుధవారం వలందపాలెం అత్తవారింటికి వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మానసికంగా కుంగిపోయిన లక్ష్మి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. లక్ష్మి అన్న వడ్లమూడి వెంకటేశ్వరరావు మచిలీపట్నం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన సోదరి ఆత్మహత్యకు సతీష్, పవన్, వెంకటేశ్వరమ్మలే కారణమని ఫిర్యాదు చేశాడు. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా సర్వజన ఆసుపత్రికి పంపారు.

విద్య, ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

● కేయూ వీసీ కె. రాంజీ

మచిలీపట్నంటౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్య, ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తూ అధిక నిధులు వెచ్చిస్తోందని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.రాంజీ పేర్కొన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం విశ్వవిద్యాలయంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ ఉపకులపతి మాట్లాడుతూ, కృష్ణా విశ్వవిద్యాలయంలో 21 రోజులుగా యోగ శిక్షణా తరగతులు జరగడం ముదావహమన్నారు. రెక్టార్‌ఎం.వి.బసవేశ్వరరావు మాట్లాడుతూ, ప్రాచీన యోగాకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. రిజిష్ట్రార్ ఎన్.ఉష మాట్లాడుతూ, యోగసాధన ఈ నెల 21 తరువాత విద్యార్థులు కొనసాగించాన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త ఎం. శ్రావణి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శేషారెడ్డి, కవిత, స్వరూప, రవి, పిడి పి. గోపీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆరోగ్యం- పౌష్టికాహారం అనే అంశంపై సదస్సు జరిగింది. న్యూట్రిషన్ స్పెషలిస్టు విద్యాసాగర్ మంచి ఆహారపు అలవాట్లపై ప్రసంగించారు.



ర్యాలీలో పాల్గొన్న కేయు వీసీ కె. రాంజీ

చల్లపల్లి ఏవోగా మురళీకృష్ణ

చల్లపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి మండల వ్యవసాయశాఖ అధికారిగా కె.మురళీకృష్ణ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఘంటసాల ఏవోగా పనిచేసిన ఆయన బదిలీల్లో భాగంగా చల్లపల్లి ఏవోగా నియమితులయ్యారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనంతరం గ్రామాల్లో పర్యటించి రైతుసేవా కేంద్రాలను సందర్శించారు. చల్లపల్లి మండల వ్యవసాయ సమాచారం తెలుసుకున్న ఆయన వీఏఏలతో సమావేశమై వారికి తగు సూచనలు, సలహాలు అందచేశారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

నాగాయలంక, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే బలహీనవర్గాలు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. నాగాయలంక బీసీ సంక్షేమ వసతి గృహంలో నూతనంగా ఏర్పాటు చేసిన కళాశాల బీసీ బాలికల వసతి గృహాన్ని మంగళవారం మండలి ప్రారంభించారు. పెడనలో ఖాళీగా ఉన్న బీసీ బాలికల వసతిగృహాన్ని నాగాయలంకకు తక్షణమే మంజూరు చేసినందుకు జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తహసీల్దార్ ఎం.హరనాథ్, ఎంపీడీవో జి.సుధాప్రవీణ్, ఎంఈవో టి.వి.ఎం.రామదాసు, వసతిగృహ అధికారులు జి.రమేష్, దివ్య, సీహెచ్ వనజాకుమారి తోపాటుగా బాలవర్ధిరావు అంకాలు, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు టీడీపీ నేతల పరామర్శ

కోడూరు: కోడూరు మండలం నరసింహాపురం గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతి పరులు వేములపల్లి సామ్రాజ్యం, యార్లగడ్డ వెంకటరత్నం అనారోగ్యంతో ఇటీవల మరణించారు. మంగళవారం శ్రీనివాసరావు స్థానిక పార్టీ నేతలతో కలసి మృతుల ఇంటికి వెళ్లి చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, సోమశేఖరరావు, శ్రీకృష్ణ, వెంకటేశ్వరరావు, అప్పికట్ల రవీంద్రబాబు, రాము, సుంకర కోటేశ్వరరావు, మురళీకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాన్ని సందర్శించిన న్యాయాధికారి

నాగాయలంక : స్థానికంగా ఉన్న వృద్ధాశ్రమాన్ని అవనిగడ్డ సబ్ కోర్టు న్యాయాధికారి కె.అరుణశ్రీ మంగళవారం సందర్శించారు. ఆశ్రమంలో ఉంటున్న వృద్ధుల ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకుని వారికి పండ్లు, రొట్టెలను అందజేశారు. వృద్ధాశ్రమం నిర్వాహకులు లీలా మనోహర్ పర్యవేక్షించారు.

జగన్మోహన్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ : మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు మంగళవారం వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గడిచిన కొంతకాలంగా సింహాద్రి రమేష్‌బాబు పార్టీ మారుతున్నారంటూ పు కార్లు షికార్లు చేస్తున్న వేళ సింహాద్రి రమేష్‌బాబు వైసీపీ అధినేతను కలవటంతో పుకార్లకు చెక్ పె ట్టినట్లైంది.

కిసాన్ మోర్చా కమిటీల నియామకం

మోపిదేవి : భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా గ్రామస్థాయి కమిటీల ఎన్నికలు మండలంలో మంగళవారం ప్రారంభించారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కౌలు రైతు సంఘ కన్వీనర్ జి.వి.నగరాయులు ఆధ్వర్యంలో కొక్కిలిగడ్డ, బొబ్బర్లంక గ్రామాల్లో పర్యటించారు. బొబ్బర్లంక కిసాన్ మోర్చా గ్రామ కమిటీ అధ్యక్షులుగా కోనేరు శివలీలా ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా మత్తి రామకృష్ణలను నియమించారు. కొక్కిలిగడ్డ గ్రామ కమిటీ అధ్యక్షులుగాశివబాల, ప్రధానకార్యదర్శిగా శ్రీనివాస రావులు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ సుబ్రహ్మణ్యం, మోపిదేవి మండల ప్రతినిధులు కామిశెట్టి రమేష్, శ్రీనివాసరావు, రామకృష్ణలు ఉన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

మచిలీపట్నం టౌన్ : జీవనోపాధి కోసం సముద్రంలోకి చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారులు అంతర్వేది వద్ద బోటు నుంచి జారిపడి మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు దాతలు సాయం అం దించాలని జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు నాగరమేష్ కోరారు. మంగళవారం ఆయన మచిలీపట్నం రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నాగాయలంక మండలానికి చెందిన నాగిడి రాము, తమ్ము పోతురాజుల మృతికి ప్రగాఢ సంతాపం